


మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపీకి పారిశ్రామిక వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రూ.26 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ, 24 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

మంగళవారం 17.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 206 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



అక్వాన్‌తో అప్రమత్తం!

తుపాను కట్టడికి కార్యాచరణ

- కోస్తా జిల్లాలపై తీవ్ర వాయుగుండం ప్రభావం
- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల మోహరింపు
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, నవంబరు 16 (జర్నలిస్ట్‌ఫైల్) : ఈ నెల 20 తేదీన కోస్తాంధ్రను తాకనున్న తుఫానుపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం మరింత బలపడి సాయంత్రానికి తుఫానుగా మారే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో తీవ్ర వాయుగుండం ప్రస్తుత పరిస్థితిపై సీఎం సమీక్ష నిర్వహించారు. దీని పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. కేంద్ర బృందం చేసిన సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడే తుఫాను ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు తెలిపారు. ఆర్నబ్ తరహాలోనే ఈ తుఫాను ప్రభావం కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రానున్న తుఫాను కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లా సహా వివిధ ప్రాంతాలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముందుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపటంతో పాటు మిగతా 2లో...

కోస్తాపై 'అక్వాన్' తుపాను ముప్పు


- బంగాళాఖాతంలో బలపడుతున్న తుపాను
- 19, 20 తేదీల్లో ప్రచండ గాలుల బీభత్సం
- సముద్రంలోకి వెళ్లొద్దని జాలర్లకు హెచ్చరిక 2 లో

తుపానుపై త్రిముఖ వ్యూహం

- అక్వాన్ ముప్పుపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- కోతకు సిద్ధమైన పంటలను తరలించాలి
- ఉద్యాన పంటలకు ముందస్తు రక్షణ
- సముద్రంలోకి వెళ్లొద్దని జాలర్లకు హెచ్చరికలు 2 లో

తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం

- విద్యుత్ శాఖకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు
- ముందుగానే పరికరాలు, సిబ్బంది సిద్ధం
- సరఫరా పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలి 2 లో



బకాయిలు పెట్టింది మీరే.. చెల్లిస్తున్నది మేమే

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్‌కు లోకేష్ కౌంటర్
- రూ.4 వేల కోట్ల బకాయిలు మీ హయాంలోనే.. రూ.5 వేల కోట్ల చెల్లింపులు మా ప్రభుత్వంలోనే

అమరావతి(జర్నలిస్ట్‌ఫైల్) : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విమర్శలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘాటుగా స్పందించారు. జగన్ చేసిన ట్వీట్ ఫేక్ ప్రచారమని పేర్కొంటూ, వాస్తవ లెక్కలతో సమాధానమిచ్చారు. బకాయిలు పేరుకుపోయేలా చేసిన గత పాలనకు, వాటిని చెల్లిస్తున్న ప్రస్తుత పాలనకు మధ్య తేడాను గమనించాలని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, మిగతా 2లో...

రెండో విడత పంచాయతీ నగారా

- ఈ నెల 29న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు
- 18 నుంచి 20 వరకు నామినేషన్లు
- 24న అభ్యర్థుల తుది జాబితా
- మూడు దశల్లో 13,171 పంచాయతీలకు ఎన్నికలు



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్): గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి పల్లెల్లో మొదలైంది. తొలివిడత ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగానే.. రెండో విడత పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 29న పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్లు స్వీకరించనుంది. 24న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుండగా.. అదే రోజు బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మిగతా 2లో...

మళ్లీ జై షానే!

- ఐసీసీ చైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక
- బాలి సమావేశంలో డైరెక్టర్ల ఏకగ్రీవ నిర్ణయం
- 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనంపై ప్రత్యేక దృష్టి
- జై షాకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు



● వివరాలు 2 లో

మన రక్షణ.. మన చేతుల్లోనే

- యుద్ధ సన్నద్ధతకు స్వదేశీ అస్త్రాలే పునాది
- సోర్స్‌కోడ్ నుంచి ఇంజిన్ల వరకు మనవే కావాలి
- 'ఆపరేషన్ సిందూర్'తో స్వదేశీ ఆయుధాల సత్తా చాటాం
- చైనా దురాక్రమణను అడ్డుకునే బలంతో భారత్
- సైబర్, అంతరిక్షమే భవిష్యత్ యుద్ధ క్షేత్రాలు



దిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్): యుద్ధం వచ్చినప్పుడు మన ఆయుధాల సామర్థ్యాన్ని మరొక దేశం నియంత్రించే పరిస్థితి ఉండకూడదు.. మన రక్షణ వ్యవస్థను విదేశీ శక్తులు స్విచ్ఛాఫ్ చేయలేకపోవాలి! భవిష్యత్ యుద్ధాలను ఎదుర్కొనేందుకు భారత్ సంపూర్ణ స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరాన్ని భారత వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ నొక్కిచెప్పారు. ఆత్మనిర్భరత అనేది కేవలం పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యం కాదని, అది నేరుగా దేశ సైనిక సంసిద్ధతతో ముడిపడిన కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు. యుద్ధ సమయంలో సోర్స్‌కోడ్, విడిభాగాలు, మందుగుండు సామగ్రి, విమాన ఇంజిన్ల కోసం విదేశాలపై ఆధారపడకూడదని పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన ఏఎన్ఐ జాతీయ భద్రతా సదస్సు 3.0లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

స్వదేశీ అస్త్రాలే అసలైన బలం : త్రివిధ దళాల సమన్వయం, స్వదేశీ ఆయుధ వ్యవస్థల సామర్థ్యాన్ని 'ఆపరేషన్ సిందూర్' నిరూపించిందని అశుతోశ్ దీక్షిత్ తెలిపారు. సంయుక్త సైనిక కార్యకలాపాల్లో ఇది కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. ఆపరేషన్ సమయంలో ఆకాశ్, బ్రహ్మోస్ వంటి స్వదేశీ ఆయుధ వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని వివరించారు. దేశ సైనిక సంసిద్ధతను అంచనా వేయడానికి నియంత్రణ, నిలకడ, పరిస్థితులకు అనుగుణంగా మిగతా 2లో...

రామోజీ సేవలు స్ఫూర్తిదాయకం

- సామాన్య రైతు కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలకు ఎదిగిన మహనీయుడు
- రామోజీరావు 90వ జయంతి వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : సమాజానికి రామోజీరావు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కొనియాడారు. వ్యక్తులు తమ కృషి, పట్టుదలతో సంస్థలుగా, వ్యవస్థలుగా ఎదుగుతారని.. అలాంటి అరుదైన వ్యక్తుల్లో రామోజీరావు ఒకరని ప్రశంసించారు. రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో సోమవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ఈ సందర్భంగా రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. కృష్ణా జిల్లాలోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రామోజీరావు తన కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. తెలుగు పాఠకులకు ప్రతిరోజూ తాజా సమాచారాన్ని అందించాలనే సంకల్పంతో ఆయన విశేషంగా కృషి చేశారని తెలిపారు. దేశంలోని వివిధ అంశాలు, సమస్యలపై రామోజీరావుకు ఉన్న లోతైన అవగాహన, వాటి పరిష్కారాలపై ఆయన చేసిన ఆలోచనలు తనను ఆశ్చర్యపరిచేవని చెప్పారు. గతంలో ఉత్తరప్రదేశ్ ఎన్నికలపై ఆయన చేసిన విశ్లేషణలు ఫలితాల్లో ప్రతిబింబించాయని గుర్తుచేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాద సమస్యను అరికట్టాల్సిన అవసరంపైనా ఆయనకు స్పష్టమైన అవగాహన ఉండేదన్నారు. 3లో...

బిల్కిస్ కేసులో ఇద్దరికి బెయిల్



- జీవిత ఖైదు శిక్ష నిలిపివేసిన సుప్రీంకోర్టు
- 17 ఏళ్లకు పైగా జైలు శిక్ష అనుభవించిన దోషులు
- విచారణ కోర్టు విధించే షరతులకు లోబడి విడుదల

న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. బిపిన్ చంద్ర జోషి, ప్రదీప్ మోర్ధియాలకు విధించిన జీవిత ఖైదు శిక్షను నిలిపివేస్తూ బెయిల్ మంజూరు చేసింది. 17 ఏళ్లకు పైగా జైలు శిక్ష అనుభవించిన నేపథ్యంలో వారి అప్పీళ్లపై తుది నిర్ణయం వెలువడే వరకు ఈ వెసులుబాటు కల్పించింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ పి.బి.వరాలేతో కూడిన ధర్మాసనం అక్టోబరు 28న ఈ మేరకు 3లో...

కుటుంబంపై అవాస్తవాలు అల్లారు

- నిజాలు చెప్పేందుకే ఆత్మకథ రాశా
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణలో సోనియా గాంధీ



న్యూఢిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్) : తన కుటుంబం గురించి ఎన్నో అవాస్తవ కథనాలు ప్రచారంలోకి వచ్చాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అన్నారు. తన అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీ, పిల్లలు రాహుల్, ప్రియాంకలతో పాటు తన కుటుంబంపై పలువురు రాసిన కథనాల్లో వాస్తవాలు లేవని పేర్కొన్నారు. బాధ కలిగించేలా, నిజాలతో సంబంధం లేని విషయాలను ప్రచారం చేశారని చెప్పారు. అందుకే తన జీవిత అనుభవాలు, కుటుంబం గురించి తనకు తెలిసిన వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథ రాసినట్లు వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో రాహుల్, ప్రియాంకలతో కలిసి ఆమె పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఇటలీలో బాల్యం నుంచి భారత్‌తో అనుబంధం, రాజీవ్‌తో పరిచయం, ప్రేమ, వివాహం, నెహ్రూ-గాంధీ కుటుంబంతో అనుబంధం వరకు తన జీవితంలోని కీలక ఘట్టాలను పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. రాజీవ్ రాజకీయాల్లోకి రావడాన్ని తొలుత వ్యతిరేకించానని, అలా వస్తే ఆయనను కోల్పోతానేమోనని భయపడ్డానని గుర్తుచేశారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో భద్రతా కారణాలతో పిల్లలను ఇంటి నుంచి బయటకు వెళ్లనిచ్చేవారు కాదన్నారు. 3లో...

అక్వాన్‌తో అప్రమత్తం!

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని సీఎం సూచించారు. అలాగే భారీ వర్షాల వల్ల వస్తున్న వరద ప్రవాహాలను రిజర్వాయర్లకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): అక్వాన్ తుపాను ముప్పు నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల సంభవించిన తుపాన్ల సమయంలో ఎదురైన పరిస్థితులు, విద్యుత్ పునరుద్ధరణలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు నేలకూలినా, తీగలు తెగిపడినా వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇందుకోసం అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, పునరుద్ధరణ పనులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. శాఖాపరమైన నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని, తుపాను సమయంలో ఎక్కడా ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెగిపడిన విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే పరిస్థితులు ఉంటే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని మంత్రి ఆదేశించారు. సరఫరా నిలిచిన ప్రాంతాలు, పునరుద్ధరణకు పట్టే సమయం తదితర వివరాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు.

బకాయిలు పెట్టింది మీరే.. చెల్లిస్తున్నది మేమే



(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల ప్రయోజనాలను విస్మరించి సుమారు రూ. 4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మిగిల్చిందని లోకేష్ ఆరోపించారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండున్నరేళ్లలో దాదాపు రూ. 5 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ ప్రతి నెలా క్రమపద్ధతిలో నిధులు విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. బకాయిలు పెట్టి ఇతరులపై నిందలు వేయడం గత పాలన విధానమైతే, ఆ బకాయిలను బాధ్యతగా తీర్చడం తమ ప్రభుత్వ విధానమని లోకేష్ పేర్కొన్నారు.

మళ్లీ జై షానే!



బాలి (జర్నలిస్ట్ ఫైల్):అంతర్జాతీయ క్రికెట్ యవనికపై మరోసారి భారతీయుడి ఆధిపత్యం చాటుకుంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా జై షా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇండోనేసియాలోని బాలి వేదికగా జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో డైరెక్టర్లు ఆయన పేరును ఏకగ్రీవంగా ఆమోదించారు. రెండోసారి ఈ బాధ్యతలు చేపట్టడం తనకు గౌరవంతోపాటు మరింత బాధ్యతను పెంచిందని జై షా పేర్కొన్నారు.
ఒలింపిక్స్‌పై ప్రత్యేక గురి : ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి సభ్య దేశాలతో కలిసి పనిచేస్తానని జై షా తెలిపారు. క్రికెట్ చరిత్రలో అత్యంత కీలకమైన, ఆసక్తికరమైన దశలోకి అడుగుపెడుతున్నామని పేర్కొన్నారు. 2028లో లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం గొప్ప అవకాశమని అభివర్ణించారు. ఈ వేదిక ద్వారా కొత్త ప్రేక్షకులకు క్రికెట్‌ను మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు. తనను మరోసారి ఎన్నుకున్న ఐసీసీ డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.
లోకేశ్ అభినందనలు : ఐసీసీ ఛైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన జై షాకు ఏపీ మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆయన సాధించిన విజయం దేశానికి గర్వకారణమని కొనియాడారు. తన మిత్రుడు జై షా మరోసారి ఈ బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. క్రికెట్ ప్రపంచంలో ఆయన సంపాదించుకున్న విశ్వసనీయతకు ఈ ఏకగ్రీవ ఎన్నిక నిదర్శనమని తెలిపారు. ప్రపంచ క్రికెట్‌ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో ఆయన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

తుపానుపై త్రిముఖ వ్యూహం



అమరావతి, నవంబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్) : అక్వాన్ తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటలకు నష్టం జరగకుండా, మత్స్యకారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులు, మత్స్యకారులకు అండగా ఉంటుందని తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికీ తావివ్వొద్దని స్పష్టం చేశారు.
23.87 లక్షల హెక్టార్ల వ్యవసాయ పంటలపై ప్రత్యేక దృష్టి : రాష్ట్రంలో నవంబర్ 14 నాటికి 21.32 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ పంటలు పొలాల్లో ఉండగా, 2.55 లక్షల హెక్టార్లలో రబీ పంటలు వేశారని మంత్రి తెలిపారు. మొత్తం 23.87 లక్షల హెక్టార్లలో పంటలు ఉన్నాయని, ఇందులో వరి 13.60 లక్షల హెక్టార్లు, కంది 4.42 లక్షల హెక్టార్లు, పత్తి 1.92 లక్షల హెక్టార్లలో సాగులో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా తీరప్రాంతంలోని 10 జిల్లాల్లో 9.51 లక్షల హెక్టార్లలో పంటలు ఉండగా, అందులో 9.16 లక్షల హెక్టార్లలో వరి పంట ఉందన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందుగానే సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు శుభ్రం చేయాలని, భారీ వర్షాల సమయంలో ఎరువులు, పురుగుమందుల పిచికారీ నిలిపివేయాలని తెలిపారు. వర్షాలు తగ్గి నేల అనుకూలంగా మారిన తర్వాతే రబీ విత్తనాలు వేయాలని సూచించారు.
16 జిల్లాల్లో 2.69 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటల రక్షణకు చర్యలు : తుఫాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న 16 జిల్లాల్లో 2,69,831 హెక్టార్ల ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఇందులో మిరప 1,08,615 హెక్టార్లు, కొబ్బరి 98,526 హెక్టార్లు, పసుపు 24,469 హెక్టార్లతో పాటు అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు ఉన్నాయని తెలిపారు. పల్నాడు, కోనసీమ, మార్కాపురం, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అరటి, బొప్పాయి మొక్కలకు ఊతం ఏర్పాటు చేయాలని, కోతకు సిద్ధమైన పంటలను ముందుగానే మార్కెట్లకు తరలించాలని సూచించారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతో పాటు శాస్త్రవేత్తల సూచనలను రైతులకు చేరవేయాలని ఆదేశించారు.
సముద్రంలోని 173 బోట్లపై నిరంతర పర్యవేక్షణ : రాష్ట్రంలోని 1,053 కిలోమీటర్ల తీరప్రాంతంలో ఉన్న 12 జిల్లాల్లో మత్స్యశాఖ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు మంత్రి తెలిపారు. మొత్తం 30,808 బోట్లలో నవంబర్ 16 ఉదయం 10 గంటల నాటికి 30,635 బోట్లు సురక్షితంగా తీరానికి చేరాయని, మిగిలిన 173 బోట్లను కూడా క్షేమంగా తీరం చేర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. కాకినాడలో 78, బాపట్లలో 38, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో చెరో 24, కృష్ణా జిల్లాలో 9 బోట్లు సముద్రంలో ఉన్నాయని వివరించారు. మత్స్యకారులకు ఇప్పటికే 1,08,250 వాయిస్ హెచ్చరికలు పంపించామని, 8,217 బోట్లను నాభిమిత్ర వ్యవస్థ ద్వారా ట్రాక్ చేస్తున్నామని చెప్పారు. తీరప్రాంతంలోని 555 మత్స్యకార గ్రామాలు, 350 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.
ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి : తుఫాను సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని మంత్రి సూచించారు. ఆక్వా రైతులు చెరువుల గట్లను బలోపేతం చేసుకోవాలని, నీటిలో ఆక్సిజన్, పీహెచ్, లవణీయత స్థాయిలను పర్యవేక్షించాలని తెలిపారు. బోట్లు, వలలు, విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. అన్ని హేచరీలతో పాటు 1,446 అంతర్గత మత్స్యకార సహకార సంఘాలకు ముందస్తు సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.
పంట నష్టాల నమోదులో నిర్లక్ష్యం వద్దు : తుఫాను ప్రభావంతో ఉద్యాన పంటలకు నష్టం జరిగితే 24 గంటల్లో ప్రాథమిక నివేదికలు, వారం రోజుల్లో రైతులవారీగా పూర్తి వివరాలు అందించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ పంటల నష్టాలను రెవెన్యూ శాఖతో కలిసి అంచనా వేయాలని, 33 శాతానికి మించి నష్టం జరిగిన పంటలకు నిబంధనల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.
రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, వ్యవసాయ పంటల పరిస్థితిపై ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ూూూ×మీ యాప్‌లో నివేదికలు నమోదు చేయాలని తెలిపారు. రైతులకు 155251 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా అవసరమైన సూచనలు అందించాలన్నారు. రైతులు పండించిన పంటలను, మత్స్యకారుల ప్రాణాలను, జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, విపత్తు సమయంలో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

కోస్తాపై 'అక్వాన్' తుపాను ముప్పు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): వరుస తుపాన్లతో ఉక్కిరిబిక్కిరవుతున్న కోస్తాంధ్రకు మరో ముప్పు ముంచుకొస్తోంది. ఇటీవల అర్నబ్, మురసు తుపాన్ల ప్రభావం నుంచి పూర్తిగా కోలుకోకముందే.. తాజాగా 'అక్వాన్' రూపంలో ప్రకృతి మరోసారి పంజా విసిరేందుకు సిద్ధమవుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడి రాష్ట్ర తీరంవైపు దూసుకొస్తోంది. సోమవారం సాయంత్రానికి తుపానుగా, ఆ తర్వాత అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. గంటకు 145 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు, 21 సెంటీమీటర్లకు పైగా కుంభవృష్టి కురిసే ప్రమాదం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంత ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.
ఉత్తర వాయవ్య దిశగా పయనం : ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 700, విశాఖపట్నానికి 800, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం సాయంత్రానికి దక్షిణ, పశ్చిమ మధ్య



బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనికి ఇరాన్ సూచించిన 'అక్వాన్' అనే పేరును ఖరారు చేశారు.
19న అతి తీవ్ర తుపానుగా.. : మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని అంచనా వేస్తున్నారు. అనంతరం మరింత బలపడి ఈ నెల 19 రాత్రికి లేదా 20వ తేదీ మధ్యాహ్నానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. నెల్లూరు--తుని మధ్య లేదా మచిలీపట్నం--గోపాల్‌పూర్ మధ్య తీరం దాటవచ్చని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే తీరం దాటే ప్రాంతంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.
145 కి.మీ. వేగంతో గాలులు : తుపాను తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నెల 19 ఉదయం నుంచి 20 ఉదయం వరకు ఏపీ తీర ప్రాంతంలో గాలుల వేగం గంటకు 145 కిలోమీటర్లకు చేరవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉండటంతో తీర ప్రాంతాల్లో అప్రమత్తత అవసరమని సూచిస్తున్నారు.
21 సెం.మీ.కు పైగా వర్షాలు : తుపాను ప్రభావంతో ఈ నెల 18న కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 19, 20 తేదీల్లో కోస్తా జిల్లాలవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో 21 సెంటీమీటర్లకు పైగా వంశపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. రాయలసీమలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.
మత్స్యకారులకు హెచ్చరికలు : తుపాను ముప్పు నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని స్పష్టం చేసింది. సాయంత్రం నుంచే తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తమ పంటలు, ఆస్తుల రక్షణకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

రెండో విడత పంచాయతీ నగారా

(మొదటి పేజీ తరువాయి)

అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.
రెండో విడత షెడ్యూల్ ఇలా..: నవంబరు 18-20: నామినేషన్ల స్వీకరణ
నవంబరు 21: ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన
నవంబరు 22: సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లకు అవకాశం
నవంబరు 23: అప్పీళ్ల పరిష్కారం
నవంబరు 24: మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ
నవంబరు 24:మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది అభ్యర్థుల జాబితా
నవంబరు 29:ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
నవంబరు 29: మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
నవంబరు 30: అవసరమైన చోట్ల రీపోలింగ్
మూడు దశల్లో ఎన్నికలు: రాష్ట్రవ్యాప్తంగా 13,171



గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26, 29, డిసెంబరు 2 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఇప్పటికే తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 21వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. 26న ఉదయం పోలింగ్ నిర్వహించి.. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో 27న రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ వెల్లడించింది.
ఏ గ్రామంలో ఏ తేదీన పంచాయతీ ఎన్నికలు జరుగుతాయో తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఎన్నికల షెడ్యూల్ వివరాలను అందుబాటులో ఉంచింది. మొబైల్ ఫోన్ ద్వారా కూడా వీటిని తెలుసుకోవచ్చు. జిల్లా, మండలం, గ్రామ పంచాయతీని ఎంపిక చేసి సెర్చ్ చేస్తే సంబంధిత ఎన్నికల తేదీలు, షెడ్యూల్ వివరాలు కనిపిస్తాయి.
వివరాల కోసం: https://swarnapanchayat.apcfss.in/knowyourgramanelectionshedule ఆస్తి పన్ను, ఇతర రుసుముల చెల్లింపుల కోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఎన్నికల సమాచారాన్ని కూడా సులభంగా పొందేలా ప్రభుత్వం ఈ సదుపాయాన్ని కల్పించింది.

వైసీపీకి భారీ షాక్.. టీడీపీలోకి వలసల జోరు!



మంగళగిరి, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ నాయకత్వంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో తాజాగా వైసీపీకి చెందిన కీలక నాయకులతో పాటు 16, 24, 25వ డివిజన్లకు చెందిన 110 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.
వైసీపీ నేత, మాజీ కౌన్సిలర్ బెజ్జం రాజాజీ, వైఎస్సార్ టీయూసీ పట్టణ అధ్యక్షుడు నక్క నాగరాజు, దిగుడుబావి రామాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అండె జ్ఞానకుమారి తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరితో పాటు ఆయా డివిజన్లకు చెందిన 110 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరడం విశేషం.
ఈ సందర్భంగా టీడీపీ పాలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి నూతనంగా పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా బెజ్జం రాజాజీ మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, నారా లోకేష్ గారు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికలపై టీడీపీ నేతల చర్చలు



తాడేపల్లిగూడెంలో రాజకీయ పరిణామాలపై సమీక్ష

తాడేపల్లిగూడెం (జర్నలిస్ట్ ఫైల్) : నర్సాపురం పార్లమెంటు పరిధిలోని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నేతలు సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ కార్యాచరణపై చర్చించారు. తాడేపల్లిగూడెం టీడీపీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, నర్సాపురం పార్లమెంటు ఇన్‌ఛార్జి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ నర్సాపురం పార్లమెంటు అధ్యక్షుడు మంతెన రామరాజు పాల్గొన్నారు.

మన రక్షణ.. మన చేతుల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

మారే వేగం కీలక ప్రమాణాలని పేర్కొన్నారు.
యుద్ధ క్షేత్రాలుగా సైబర్, అంతరిక్షం : భవిష్యత్తులో యుద్ధాలు అధికారిక ప్రకటనలతో ప్రారంభం కావాల్సిన అవసరం లేదని ఐఏఎఫ్ చీఫ్ అభిప్రాయపడ్డారు. సైబర్ స్పేస్, విద్యుదయస్కాంత స్పెక్ట్రమ్, అంతరిక్షంలోనే తొలి దాడులు మొదలయ్యే అవకాశం ఉందన్నారు. శత్రువు కంటే వేగంగా నిర్ణయాలు తీసుకునే దేశానికే పైచేయి లభిస్తుందని చెప్పారు. ఆధునిక యుద్ధాల్లో ఆయుధాల సంఖ్యతో పాటు వాటిని ఎంత సమర్థంగా వినియోగించగలమన్నదీ ముఖ్యమని వివరించారు.
క్షిపణుల నిల్వలకూ కొరత తప్పదు : ఆధునిక యుద్ధాల్లో ఆయుధాల వినియోగం ఎంత వేగంగా పెరుగుతోందో అమెరికా ఉదాహరణతో వివరించారు. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా తన పేట్రియాట్ గగనతల రక్షణ ఇంటర్‌సెప్టర్ క్షిపణుల్లో దాదాపు మూడింట రెండొంతులు వినియోగించిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 172 కొత్త క్షిపణులు మాత్రమే అందగా.. వెయ్యికి పైగా ప్రయోగించినట్లు పేర్కొన్నారు. వినియోగించిన నిల్వలను తిరిగి భర్తీ చేసుకోవడానికి ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ పరిశ్రమకు సైతం 2030 చివరి వరకు సమయం పట్టవచ్చని వివరించారు. యుద్ధ సమయాల్లో నిరంతర ఆయుధ సరఫరా ఎంత కీలకమో ఈ పరిణామాలు తెలియజేస్తున్నాయని చెప్పారు.
తేజస్ నుంచి ఏఎంసీఏ వరకు.. : స్వదేశీ యుద్ధ విమానాల అభివృద్ధిపై వాయుసేన ప్రత్యేక దృష్టి సారించిందని అతుతోశ్ దీక్షిత్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఎల్‌సీఏ మార్క్-1ఏ స్క్వాడ్రన్‌ను వాయుసేనలో చేర్చుకోనున్నట్లు తెలిపారు. తదుపరి తరం ఎల్‌సీఏ మార్క్-2, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) తయారీ పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఒక యుద్ధ విమానం రూపకల్పనకు అనేక



శాస్త్రీయ విభాగాల్లో నైపుణ్యం అవసరమని, తేజస్ అభివృద్ధిలో దేశవ్యాప్తంగా అనేక సంస్థలు, ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు భాగస్వాములయ్యాయని వివరించారు.
చైనాను నిలువరించే సత్తా ఉంది : చైనా సైనిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచామని ఐఏఎఫ్ చీఫ్ తెలిపారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వైమానిక దళ సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతికతలను జోడిస్తున్నట్లు వెల్లడించారు. చైనా చేపట్టే ఎలాంటి దురాక్రమణనైనా అడ్డుకోగల బలమైన స్థితిలో భారత్ ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల్లో పూర్తిస్థాయి శాంతి, యుద్ధం కాని పరిస్థితి కొనసాగుతోందన్నారు. అవసరమైతే రక్షణాత్మక, దాడి వ్యూహాల్లోకి మారేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

రామోజీ సేవలు స్ఫూర్తిదాయకం



(మొదటి పేజీ తరువాయి)

రామోజీరావుకు పద్మవిభూషణ్ పురస్కారం లభించినప్పుడు.. అది తెలుగు గడ్డకు, పాత్రికేయ రంగానికి దక్కిన గౌరవమంటూ గుజరాత్‌లోని ఓ పత్రిక పేర్కొన్న విషయాన్ని అమిత్‌షా ప్రస్తావించారు. సినిమా రంగానికి సైతం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సినిమా నిర్మాణానికి అవసరమైన సమస్త సదుపాయాలను ఒకే చోట అందిస్తోందని తెలిపారు.

రాబోయే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో అగ్రస్థానానికి చేరుకుంటుందన్న ఆశాభావాన్ని అమిత్‌షా వ్యక్తం చేశారు. రెవెన్యూ లోటుతో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని ప్రశంసించారు. రెండున్నరేళ్లలో రాష్ట్రానికి రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని వెల్లడించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రామోజీరావు జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇకపై ఏటా ఆయన జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. రామోజీ పేరుతో అవార్డులు ఏర్పాటు చేసి, జయంతి రోజున ప్రదానం చేయడం అభినందనీయమన్నారు.

జర్నలిజం, కళలు-సంస్కృతి, గ్రామీణాభివృద్ధి-వ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యూత్ ఐకాన్, విద్య, వైద్యం-ఆరోగ్యం విభాగాల్లో ఈ అవార్డులను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఈనాడు గ్రూప్ సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బిల్కిస్ కేసులో ఇద్దరికి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేయగా.. అవి తాజాగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. విచారణ కోర్టు విధించే నిబంధనలు, షరతులకు లోబడి వారు బెయిల్‌పై విడుదల కావచ్చని స్పష్టం చేసింది. దోషుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఇద్దరూ 17 ఏళ్లకు పైగా జైల్లో ఉన్నారని, వారిలో ఒకరు తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్నారని తెలిపారు. వీరిలో ఒకరి పేరు తొలుత నమోదైన ఎఫ్ఐఆర్‌లో లేదని పేర్కొన్నారు. అదనపు సొలిసిటర్ జనరల్ రాజా ఠాక్రే బెయిల్ అభ్యర్థనను వ్యతిరేకించారు. నేరం అత్యంత తీవ్రమైనదని, కింది కోర్టులు సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాతే శిక్ష విధించాయని వివరించారు.

2002 ఫిబ్రవరిలో అల్లర్ల సమయంలో ఐదు నెలల గర్భిణిగా ఉన్న 21 ఏళ్ల బిల్కిస్ బానోపై నిందితులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మూడేళ్ల కుమార్తె సహా కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో 11 మందికి జీవిత ఖైదు విధించారు. 2024 జనవరి 8న సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వం కల్పించిన శిక్షా తగ్గింపును రద్దు చేసింది. ఆ అధికారం మహారాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూ గుజరాత్ ప్రభుత్వ తీరును తప్పుబట్టింది.

కుటుంబంపై అవాస్తవాలు అల్లారు

(మొదటి పేజీ తరువాయి)

రాజీవ్ మరణం తర్వాత పూర్తిగా కుంగిపోయానని, పిల్లలే తనకు అండగా నిలిచారని చెప్పారు.

ఇందిరా గాంధీ తేజోవంతమైన వ్యక్తిత్వం కలిగిన నాయకురాలని, ఆమెను చూసి అబ్బురపడేదాన్నని సోనియా గుర్తుచేసుకున్నారు. ఆమెను చూస్తే భయం కూడా వేసేదన్నారు. తొలుత ఆత్మకథ రాయడానికి సంకోచించినా పాఠకుల నుంచి వస్తున్న స్పందన తనను కదిలించిందని తెలిపారు.

పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతల ఐక్యతకు వేదికగా నిలిచింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

20 నుండి బ్రహ్మంగారి జయంతి ఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం లో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి అష్టాదశోత్తర చతుశ్శత జయంతి(418) మహోత్సవములు మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆశీస్సులతో అంగరంగ వైభవంగా భక్త జన సందోహం మధ్య జరుపుతున్నట్లు బ్రహ్మంగారిమఠం మేనేజర్ పల్లకొండ పెంచల నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 418 వ జయంతి మహోత్సవాలు ఈనెల 20- 11- 2026 శుక్రవారం నుండి 22- 11- 2026 ఆదివారం వరకు జరుగునని,రాష్ట్రంలో ఉన్న మరియు ఇతర రాష్ట్రాలలో ఉన్న బ్రహ్మంగారి భక్తులు మరియు ప్రజలు ఈ జయంతి మహోత్సవాలలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆయన తెలిపారు.

20 వ తేదీ ప్రత్యేక పూజలు,హోమాలు : శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జయంతి మహోత్సవాల భాగంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములు వారు ధర్మపత్ని ఉమాదేవి చేతుల మీదుగా స్వామివారికి ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహిస్తారు.

21 వ తేదీ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి అభిషేకం కలశోత్సవము : శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 418 జయంతి మహోత్సవాలలో భాగంగా 21 వ తేదీ శనివారం కార్తీక శుద్ధ ద్వాదశి నాడు శ్రీ స్వామివారు అవతరించిన పవిత్ర దినం ను పురస్కరించుకొని, వచ్చిన భక్తులతో ఉదయం 10 గంటలకు 418 కలశాలకు పూజలు నిర్వహించి, అత్యంత వైభవంగా ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మంగారి ఉద్యానవనం(పార్కు) నందు ప్రతిష్ఠించిన శ్రీ స్వామివారి శిలా మూర్తికి శేష క్షీరాభిషేకము, పంచామృత అభిషేకము, కలశ స్నపనము జరుగును.

21వ తేదీ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణం : జయంతి మహోత్సవాల్లో భాగంగా 21వ తేదీ శనివారం నాడు బ్రహ్మంగారి భక్తులు, గ్రామ ప్రజల సమక్షంలో వేద పండితుల ద్వారా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి ధర్మపత్ని ఉమాదేవి చేతుల మీదుగా అక్కడి వచ్చిన భక్తులతో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికి సామూహిక కళ్యాణ మహోత్సవము రాత్రి 7.30 గంటలకు అంగరంగ వైభవంగా జరుగును.

22 వ తేదీ ప్రసాద వినియోగము, కార్తీక సహస్ర దీపార్చన : శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జయంతి సందర్భముగా మధ్యాహ్నము 12.30 గంటలకు భక్తులకు,గ్రామస్తులకు స్వామి వారి ప్రసాద వినియోగము, సాయంత్రం 6 గంటలకు కార్తీక సహస్ర దీపార్చన భక్తుల మధ్య జరుపబడును. కాబట్టి భక్తులు ఈ జయంతి ఉత్సవాలలో పాల్గొనాలని మనవి.

పైరవీలకు తావులేకుండా రూ.75 కోట్ల మందుల కొనుగోళ్లు



- 3.5 కోట్ల హిమోగ్లోబిన్ స్ట్రిప్స్ సేకరణకు సూత్రప్రాయ అంగీకారం
- టెండర్లలో నిబంధనలకే ప్రాధాన్యం..
- బెదిరింపులకు లొంగొద్దు: మంత్రి సత్యకుమార్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని వైద్యారోగ్య సేవలకు అవసరమైన 31 రకాల మందులు, ఇతర వైద్య పరికరాల కొనుగోలుకు సుమారు రూ. 75 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలోని బిడ్ ఫైనలైజేషన్ కమిటీ (బీఎఫ్‌సీ) టెండర్లను పరిశీలించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నులిపురుగుల నివారణకు రూ. 7.52 కోట్లతో 6.51 కోట్ల అల్బెండజోల్ మాత్రలు, జ్వర నివారణకు రూ. 3.18 కోట్లతో 9.61 కోట్ల పారాసిటమాల్ మాత్రలు, అత్యవసర వైద్య సేవలకు రూ. 1.50 కోట్లతో 17.90 లక్షల హైడ్రోకార్టిజోన్ ఇంజెక్షన్లు కొనుగోలు చేయనున్నారు. 26 రకాల మందులకు రెండేళ్లపాటు రేట్ కాంట్రాక్టు విధానంలో సుమారు రూ. 29 కోట్లు, మరో ఐదు రకాల మందులను మూడు నెలల అవసరాలకు రూ. 15 కోట్లతో సేకరించనున్నారు. ముడిసరుకుల ధరల పెరుగుదలతో కొన్ని మందుల ధరలు పెరిగినట్లు కమిటీ పేర్కొంది.

రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని గుర్తించే 3.5 కోట్ల డిజిటల్ స్ట్రిప్స్ కొనుగోలుకు కూడా బీఎఫ్‌సీ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఎల్-1 సంస్థ కోట్ చేసిన ధర ప్రకారం ఒక్కో స్ట్రిప్‌కు రూ. 9.45 చొప్పున మొత్తం వ్యయం సుమారు రూ. 33 కోట్లు కానుంది. ఈ టెండర్‌లో రెండు సంస్థలు బిడ్లు దాఖలు చేయగా, సాంకేతిక అర్హతల నిబంధనలు పూర్తి చేయని కారణంగా ఒక సంస్థ అనర్హతకు గురైంది. 2023లో ఒక్కో స్ట్రిప్‌ను రూ. 6.36కు సరఫరా చేసిన ఖ్రిగ్ నేనో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రస్తుత టెండర్‌లో అర్హత సాధించింది. ఎల్-1 సంస్థతో ధరపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

ప్రస్తుత టెండర్‌లో అధునాతన పరికరాలు, డిజిటల్ అనుసంధానం, ఒక్కసారి మాత్రమే వినియోగించే ఆటోమేటిక్ లాన్సెట్లు, శిక్షణ, సాంకేతిక సేవలను కూడా చేర్చినట్లు అధికారులు వివరించారు. ప్రతి 1,500 స్ట్రిప్స్ కొనుగోలుకు సుమారు రూ. 2,700 విలువైన హిమోగ్లోబిన్ మీటర్‌ను సరఫరా సంస్థ ఉచితంగా అందించనుంది. వీటి ద్వారా హిమోగ్లోబిన్ స్థాయిలపై రాష్ట్రవ్యాప్తంగా సమాచార సేకరణ, పర్యవేక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. సుమారు 25 వేల మంది ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు సరఫరా సంస్థ రెండుసార్లు శిక్షణ ఇవ్వనుంది.

టెండర్ల నిర్ణయాలపై కొందరు పాత్రికేయులు జోక్యం చేసుకుంటూ, అనర్హత పొందిన సంస్థకు సరఫరా ఆర్డర్ ఇచ్చేలా చూడాలని అధికారులను బెదిరిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి ఎలాంటి పైరవీలకు, బెదిరింపులకు లొంగకుండా పూర్తిగా నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇలాంటి ఒత్తిళ్లు ఎదురైతే సంబంధిత యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

మఠాధిపతిగా వెంకటాద్రి స్వామి నియామకం పూర్తి చట్టవ్యతిరేకమన్న హైకోర్టు

- మఠాన్ని నాకెప్పుడో మా నాన్న అమ్మేసాడని కోర్టుకు చెప్పిన 2వ కొడుకు వీరభద్రయ్య స్వామి
- మఠాధిపతిగా ముందు అర్హులను గుర్తించాలన్న గురుపత్ని మారుతి మహాలక్ష్మి



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠానికి 2021 మే 8న పీఠాధిపతులు స్వర్గస్తులవగా మే 10 2021 న తదుపరి మఠాధిపతిగా నియామకమైన గోవిందస్వామి నియామకం గుర్తించమని ధార్మిక పరిషత్ కు లేఖ రాశారు.

ఆనియామకాన్ని ఆపడానికి వివాదాలు గొడవలు అరాచకాలు జరిపించారు పి పి ఎన్ ప్రసాద్ , వెంకటాద్రి స్వాములు.

మఠాధిపతికి వీలునామా రాసే హక్కులేదని కేవలం పెద్ద కొడుకు మాత్రమే మఠాధిపతవుతారని ఒక విచిత్ర వాదన లేపి పీఠాధిపతుల ముసుగులో కాషాయ వస్త్రాలు వారి వర్గం వారికి కప్పి మఠంలో భారీ వివాదాలు చేశారు 2021 మే చివరి వారంలో. అప్పటివరకు ధార్మిక పరిషత్ వద్ద ఒకే ఒక్క వీలునామా మరియు దరఖాస్తు ఉండగా వివాదాన్ని పెద్దది చేయడానికి వివాదానికి మూల కారణమైన దొంగ వీలునామాలు సృష్టించి అనేక వీలునామాలు మఠాధిపతి రాసారని దొంగ ప్రచారాలు చేస్తూ ధార్మిక పరిషత్ ని తప్పుదోవ పట్టించారు. భారీగా స్త్రీల మీద దుష్ప్రచారం చేశారు వారు.

మఠాధిపతులు స్వర్గస్తులైన 45 రోజుల తర్వాత వీరభద్ర స్వామి మఠాధిపతిగా నన్ను నియామకం చేయమని ధార్మిక పరిషత్ కు లేఖలు రాసారు.

ఆయా లేఖలలో మఠంను వారి నాన్న గారు తనకు అమ్మినట్టుగా రాసారు.

వివాదం పెద్దది కావడంతో గురుపత్ని కోర్ట్ ని ఆశ్రయించారు. దాదాపు నాలుగు సంవత్సరాల విచారణ తర్వాత కోర్టు తీర్పు మేరకు శిష్యుల సమావేశం ద్వారా అర్హతలను నిర్ణయం చేసి, శిష్యులు నిర్ణయం చేసిన వారిని ధార్మిక పరిషత్ మఠాధిపతులుగా గుర్తించాల్సి ఉండగా, ధార్మిక పరిషత్ పూర్తి అక్రమమార్గంలో వెంకటాద్రి స్వామిని తాత్కాలిక మఠాధిపతులుగా నియమించడం తో ఆ పద్ధతి సరైన పద్ధతి కాదని పూర్వపు మఠాధిపతులు శిష్య బృందం సలహాల మేరకు కాకుండా ఎక్కడెక్కడ నుంచో వచ్చిన ప్రజలు చేత ఎన్నుకోబడిన మఠాధిపతుల నియామకం పూర్తిగా అక్రమం అని చేత వ్యతిరేకమని కేసు వేయగా పిటీషన్ వాదనతో ఏకీభవించిన హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేసారని

పూర్వ మఠాధిపతులు శ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాములవారి భార్య మారుతి మహాలక్ష్మి విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠానికి మఠాధిపతులుగా అయ్యే అర్హత పూర్వ మఠాధిపతుల 5 వ కొడుకు గోవింద స్వామికి మాత్రమే ఉన్నదని వారి వీలునామా ద్వారా తెలిపారనీ ఆమె చెప్పారు.

ధార్మిక పరిషత్ అర్హతలు నిష్ణాతులైన అధ్యాంతిక వేత్తలతో నిర్ణయం చేసి, శిష్యుల మీటింగ్ ద్వారా మఠాధిపతులుగా నియమించాలని కోరారు.

కేవలం పెద్ద కుమారుడు గా పుట్టడమే మఠాధిపతికి అర్హతనీ, అలానే పెళ్లయి సంసార జీవితంలో ఉంటే చాలుననే వెంకటాద్రి స్వామి వాదనను హైకోర్టు వారు పూర్తిగా పక్కన పెట్టేసారనీ ఆమె తెలిపారు.

అలాగే గత నాలుగు సంవత్సరాల నుండి జరిగిన పరిణామాల దృష్ట్యా కోర్టు వాదనలు ప్రతి వాదనలు విన్న తర్వాత ప్రస్తుతం మఠాధిపతులుగా కొనసాగుతున్న శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి నియామకం పూర్తిగా అక్రమం చట్టవ్యతిరేకమని కోర్టు వారు రద్దు చేయడమే కాకుండా మూడు నెలల్లో శిష్యులను పిలిచి అర్హతలు నిర్ణయం చేసి నూతన మఠాధిపతిని నియమించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఆమె తెలిపారు.

కావున ధార్మిక పరిషత్ వారు త్వరితగతిన విధి విధానాలు నిర్ణయం చేసి అర్హత పరీక్షలు నిర్వహించి గతంలో జరిగిన విధంగా కాకుండా నూతన మఠాధిపతి ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని ఆమె కోరారు..

మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



గుంటూరు, నవంబర్ 16 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ నూతన మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కౌన్సిల్ హాల్‌లో సభ్యుల సీటింగ్ ఏర్పాట్లను, సమావేశాల నిర్వహణకు అవసరమైన మైక్, సౌండ్ సిస్టమ్ పనితీరును కమిషనర్ పరిశీలించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మైక్‌లు, సౌండ్ సిస్టమ్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని సూచించారు.

అనంతరం మేయర్ చాంబర్‌తో పాటు డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ గదులను పరిశీలించారు. ఆయా గదుల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి సిద్ధం చేయాలన్నారు. కార్పొరేటర్ల కోసం కేటాయించిన గదులను కూడా పరిశీలించి, అవసరమైన ఫర్నిచర్, ఇతర సదుపాయాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జీఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణం, వివిధ విభాగాల పరిసరాలను పరిశీలించిన కమిషనర్ అక్కడక్కడా పేరుకుపోయిన నిరుపయోగ సామగ్రిపై అసహనం వ్యక్తం చేశారు. వినియోగంలో లేని పాత బీరువాలు, విరిగిపోయిన ఫర్నిచర్, ఇతర పనికిరాని వస్తువులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు నిరంతరం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి. వెంకటేశ్వరరావు, డీఈఈ చైతన్య, మేనేజర్ బాలాజీ భాష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యంగా ఏపీ ఎన్జీజీఓ సంఘం మెగా వైద్య శిబిరం

- గుంటూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్
- 450 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు..
- క్యాన్సర్ ముందస్తు గుర్తింపునకు ప్రత్యేక స్క్రీనింగ్













గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల ముందస్తు గుర్తింపే లక్ష్యంగా ఏపీ ఎన్జీజీఓ సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వేదాంత హాస్పిటల్ సహకారంతో స్థానిక ఏపీ ఎన్జీజీఓ కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన ఈ శిబిరాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఏపీ ఎన్జీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ కనీసం గంట సమయం వ్యాయామానికి కేటాయించాలని పిలుపునిచ్చారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.


రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం ఏపీ ఎన్జీజీఓ సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుంటూరు జిల్లా సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

శిబిరంలో 70 మందికి మాస్టర్ హెల్త్ చెకప్, 300 మందికి జనరల్ హెల్త్ చెకప్, 80 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం అమెరికా నుంచి వచ్చిన పింక్ సొసైటీ వైద్య బృందం ప్రత్యేక సేవలందించింది. ఈ బృందంలో డాక్టర్ సమత కడియాల, డాక్టర్ కరోల్ హటాక్, డాక్టర్ హబిక్ మిస్పెల్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుందరాచార్యులు, సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి, వేదాంత హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ, నాట్కో కోఆర్డినేటర్ అశోక్ కుమార్, డాక్టర్ బత్తుల శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీజీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, మహిళా చైర్‌పర్సన్ తాజ్జీసా తదితరులు పాల్గొన్నారు. జిల్లా, నగర శాఖల కార్యవర్గ సభ్యులు, మహిళా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జర్నలిస్ట్ ఫైల్ JOURNALIST FILE
సంపాదక స్వరం EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

విజయ డెయిరీపై హైకోర్టు తీర్పు.. ఆలోచించాల్సిన సమయం !



ఆంధ్రప్రదేశ్‌లో సహకార రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పాడి పరిశ్రమ అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, పశు పోషకులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఇలాంటి సంస్థల నిర్వహణలో రాజకీయ జోక్యం, పదవుల కోసం పోటీ, నిబంధనల ఉల్లంఘన చోటుచేసుకుంటే వాటి ప్రభావం సంస్థల విశ్వసనీయతపైనే కాకుండా వేలాది మంది పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలపైనా పడుతుంది. తాజాగా విజయ డెయిరీ పాలకవర్గ ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వెలువరించిన తీర్పు ఈ అంశాలను మరోసారి చర్చకు తీసుకొచ్చింది.

నిబంధనల కంటే ఎవరూ అతీతులు కారు : విజయ డెయిరీ పాలకవర్గ ఎన్నికల విషయంలో ప్రధానంగా తెరపైకి వచ్చిన అంశం కోరం. అందుబాటులో ఉన్న వార్తా వివరాల ప్రకారం, ఎన్నిక నిర్వహించడానికి అవసరమైన పది మంది సభ్యుల కోరం ఉండాల్సి ఉండగా, కేవలం ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం ఛైర్మన్‌గా ఎన్నికైన దాసరి వెంకట బాలవర్ధనరావుతో పాటు మరో నలుగురు డైరెక్టర్ల ఎన్నికలను హైకోర్టు చెల్లనివిగా ప్రకటించింది. డైరెక్టర్ పదవికి బాలవర్ధనరావు అనర్హుడని కూడా తీర్పులో పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

ఈ పరిణామం ఒక వ్యక్తి లేదా కొందరు డైరెక్టర్ల పదవులకే పరిమితమైన అంశం కాదు. సహకార సంస్థల్లో నిర్ణయాలు తీసుకునే విధానం, ఎన్నికల నిర్వహణ, చట్టబద్ధమైన కోరం పాటించడం ఎంత ముఖ్యమో ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. సంస్థకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు వ్యక్తుల పలుకుబడి, రాజకీయ ప్రాబల్యం కంటే సంస్థ నిబంధనలకే ప్రాధాన్యం ఉండాలి.

రాజకీయ జోక్యానికి అతీతంగా సహకార సంస్థలు : విజయ డెయిరీ ఛైర్మన్ పదవి వ్యవహారం గత కొంతకాలంగా రాజకీయ చర్చలకు కేంద్రంగా ఉంది. గతంలో ఛైర్మన్‌గా కొనసాగిన చలసాని ఆంజనేయులు తిరిగి ఎన్నికైన కొద్దికాలానికే రాజీనామా చేయడం, అనంతరం కొత్త ఛైర్మన్ ఎంపిక జరగడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంలో అధికార పార్టీ నాయకత్వం జోక్యం, పదవుల కోసం అంతర్గత పోటీ వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

రాజకీయ పార్టీలకు తమ అనుబంధ సంస్థల్లో నాయకత్వ మార్పులపై అభిప్రాయాలు ఉండవచ్చు. అయితే సహకార సంస్థలు కేవలం రాజకీయ పదవుల పంపిణీ కేంద్రాలుగా మారకూడదు. వాటి ప్రధాన లక్ష్యం సభ్యుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడటం, సంస్థను సమర్థవంతంగా నిర్వహించడం కావాలి. రాజకీయ నాయకత్వం సూచనలు ఇచ్చినా, తుది నిర్ణయాలు చట్టబద్ధమైన ప్రక్రియలోనే జరగాలి.

పాల ఉత్పత్తిదారుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యం : విజయ డెయిరీ వంటి సంస్థల వెనుక వేలాది మంది పాడి రైతుల శ్రమ, పెట్టుబడి, జీవనోపాధి ముడిపడి ఉన్నాయి. పాలు సేకరించడం నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి దశలో సంస్థ పనితీరు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతుంది. పాల సేకరణ ధరలు, చెల్లింపుల సమయపాలన, పశువైద్య సేవలు, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై పాలకవర్గం దృష్టి సారించాలి.

ఛైర్మన్ పదవి కోసం రాజకీయ పోటీ, వర్గ విభేదాలు, న్యాయ వివాదాలు కొనసాగితే సంస్థ అభివృద్ధి కుంటుపడుతుంది. పాల ఉత్పత్తిదారుల సమస్యలు పక్కకు వెళ్లిపోతాయి. అందువల్ల పాలకవర్గంలో ఎవరున్నా రైతుల ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా ఉండాలి.


తీర్పును గౌరవించి.. పాలనను చక్కదిద్దాలి : హైకోర్టు తీర్పు నేపథ్యంలో విజయ డెయిరీ పాలకవర్గం తదుపరి చర్యలు అత్యంత కీలకం. న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా తదుపరి ఎన్నికల ప్రక్రియను చేపట్టాలి. అవసరమైన కోరం, అర్హతలు, ఎన్నికల విధానం, సంబంధిత సహకార చట్ట నిబంధనలను పూర్తిస్థాయిలో పరిశీలించాలి. ఈ ప్రక్రియలో ఎలాంటి సందేహాలకు, వివాదాలకు తావులేకుండా చూడాలి. ప్రభుత్వం, సంబంధిత సహకార శాఖ అధికారులు కూడా సంస్థలో పరిపాలనా స్థిరత్వం నెలకొల్పే దిశగా చర్యలు తీసుకోవాలి. న్యాయస్థానం తీర్పును రాజకీయ కోణంలో చూడకుండా, సంస్థాగత సంస్కరణలకు ఒక అవకాశంగా తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలు పునరావృతం కాకుండా ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించాలి.

సహకార రంగానికి కావాల్సింది స్వచ్ఛమైన పాలన : సహకార రంగం ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ప్రతీక. సభ్యుల భాగస్వామ్యం, పరస్పర విశ్వాసం, పారదర్శక నిర్వహణ దాని పునాదులు. ఈ పునాదులు బలహీనపడితే సంస్థలు తమ అసలు లక్ష్యాలను కోల్పోతాయి. రాజకీయ ప్రయోజనాల కోసం సహకార సంస్థలను ఉపయోగించుకోవాలనే ధోరణికి స్వస్తి పలకాలి. విజయ డెయిరీ వ్యవహారంలో హైకోర్టు తీర్పు కేవలం ఒక ఎన్నిక చెల్లదని ప్రకటించడంతో ముగిసిపోకూడదు. రాష్ట్రంలోని ఇతర సహకార సంస్థలకు కూడా ఇది ఒక హెచ్చరికగా నిలవాలి. నిబంధనలను పాటించడం ఐచ్ఛికం కాదు.. అది ప్రతి పాలకవర్గం బాధ్యత. పదవులు తాత్కాలికం.. సంస్థల ప్రయోజనాలు శాశ్వతం. వ్యక్తుల ప్రయోజనాల కంటే సభ్యుల ప్రయోజనాలు, రాజకీయ ఆధిపత్యం కంటే చట్టబద్ధమైన పాలన, పదవుల పోటీ కంటే సంస్థ అభివృద్ధి ముఖ్యమనే సూత్రాన్ని ప్రతి సహకార సంస్థ ఆచరణలో పెట్టాలి.

సహకార రంగం రాజకీయ ఆధిపత్యానికి వేదిక కాకూడదు. రైతుల ఆర్థిక అభ్యున్నతికి అండగా నిలవాలి. విజయ డెయిరీ వివాదం నుంచి పాలకులు, రాజకీయ నాయకులు, సహకార సంస్థల నిర్వాహకులు నేర్చుకోవాల్సిన అసలైన పాఠం ఇదే!

12.29 శాతానికి టోకు ద్రవ్యోల్బణం..

ధరల ఒత్తిడిలో దేశం !



దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల పెరుగుదల మరోసారి ఆందోళన కలిగిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన వ్యయాలు, పారిశ్రామిక ముడిసరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో టోకు ద్రవ్యోల్బణం గణనీయంగా ఎగబాకడం ఆర్థిక విధాన నిర్ణేతలకు కొత్త సవాలుగా మారింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం 2026 అక్టోబర్‌లో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది. సెప్టెంబర్‌లో ఇది 11.39 శాతంగా ఉంది. అంటే నెల వ్యవధిలోనే ద్రవ్యోల్బణ ఒత్తిడి మరింత పెరిగింది. ప్రస్తుత 2022-23 ప్రాతిపదికన రూపొందించిన టోకు ధరల సూచీ సిరీస్‌లో ఇది అత్యధిక స్థాయి. ముఖ్యంగా ఇంధనం, విద్యుత్ రంగాల్లో ధరల పెరుగుదల ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా నిలిచింది. ఒకవైపు ఉత్పత్తి వ్యయాలు పెరుగుతుంటే, మరోవైపు వినియోగదారుల కొనుగోలు శక్తిపై ఒత్తిడి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాన్ని కేవలం గణాంకాల పెరుగుదలగా కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలపై ప్రభావం చూపే పరిణామంగా చూడాలి.

ఇంధన ధరలే ప్రధాన కారణం : అక్టోబర్ నెలలో ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం ఏకంగా 32.84 శాతానికి చేరడం ఆందోళనకరం. సెప్టెంబర్‌లో ఇది 25.85 శాతంగా ఉంది. ముడి చమురు, సహజ వాయువు ధరల్లో పెరుగుదల, పెట్రోలియం ఉత్పత్తుల వ్యయాలు, విద్యుత్ ధరలు ఈ పరిస్థితికి దోహదపడ్డాయి. ముడి చమురు, సహజ వాయువు విభాగంలో వార్షిక ధరల పెరుగుదల 70.80 శాతంగా నమోదైంది. ఖనిజ నూనెల విభాగంలోనూ 45.57 శాతం పెరుగుదల కనిపించింది.

ప్రపంచ చమురు మార్కెట్లలో ఒడిదుడుకులు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు, సరఫరా వ్యవస్థలో అనిశ్చితి వంటి అంశాలు ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయి. భారత్ తన చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా సమకూర్చుకుంటున్నందున అంతర్జాతీయ ధరల మార్పులు దేశీయ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

సామాన్యుడి కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం : టోకు ధరలు పెరిగాయని వెంటనే అన్ని వస్తువుల రిటైల్ ధరలు అదే స్థాయిలో పెరుగుతాయని భావించకూడదు. టోకు ద్రవ్యోల్బణం ప్రధానంగా ఉత్పత్తి, సరఫరా దశల్లో ధరల మార్పును సూచిస్తుంది. రిటైల్ ద్రవ్యోల్బణం మాత్రం వినియోగదారుడు చెల్లించే ధరల పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. అయితే టోకు ధరల పెరుగుదల ఎక్కువకాలం కొనసాగితే దాని ప్రభావం క్రమంగా వినియోగదారులపై పడే అవకాశం ఉంది.

రవాణా ఖర్చులు పెరిగితే కూరగాయలు, పండ్లు, పాలు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా వ్యయం పెరుగుతుంది. ప్లాస్టిక్, రసాయనాలు, ప్యాకేజింగ్, వస్త్రాలు, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగితే వాటితో తయారయ్యే తుది ఉత్పత్తుల ధరలపైనా ప్రభావం పడుతుంది. ఇప్పటికే కుటుంబ బడ్జెట్‌ను సమతుల్యం చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు ఇది మరింత భారంగా మారవచ్చు.

అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 6.09 శాతానికి చేరి రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 6 శాతం గరిష్ఠ పరిమితిని దాటినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంటే టోకు ధరల ఒత్తిడితో పాటు వినియోగదారుల ధరల పెరుగుదల కూడా ఆందోళన కలిగిస్తోంది.

పరిశ్రమలకు పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం : టోకు ద్రవ్యోల్బణం పెరుగుదల పారిశ్రామిక రంగానికి మరో సమస్యను సృష్టిస్తోంది. తయారీ రంగంలో ముడిసరుకులు, ఇంధనం, విద్యుత్, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగితే ఉత్పత్తి వ్యయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈ భారం ఎక్కువగా ఉంటుంది. పెద్ద సంస్థలతో పోలిస్తే చిన్న పరిశ్రమలకు ధరల పెరుగుదలను తట్టుకునే ఆర్థిక సామర్థ్యం పరిమితంగా ఉంటుంది.

అక్టోబర్ గణాంకాల ప్రకారం ప్రాథమిక వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 9.24 శాతంగా నమోదైంది. తయారీ ఉత్పత్తుల విభాగంలో 9.54 శాతంగా ఉంది. సెప్టెంబర్‌తో పోలిస్తే తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గినప్పటికీ, రసాయనాలు, లోహాలు, వస్త్రాలు, రబ్బరు, ప్లాస్టిక్ ఉత్పత్తుల ధరల్లో ఒత్తిడి కొనసాగుతోంది.

పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఉత్పత్తి వ్యయం పెరగడమే కాదు.. ఆ పెరిగిన వ్యయాన్ని వినియోగదారులపై ఎంతవరకు బదిలీ చేయగలమన్నదీ కీలకమే. మార్కెట్‌లో పోటీ, వినియోగదారుల కొనుగోలు శక్తి, డిమాండ్ తగ్గే ప్రమాదం కారణంగా అనేక కంపెనీలు వెంటనే తమ ఉత్పత్తుల ధరలను పెంచలేవు. ధరలు పెంచితే అమ్మకాలు తగ్గే ప్రమాదం ఉంటుంది. పెంచకపోతే లాభాల మార్జిన్లు క్షీణిస్తాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, ఎంఎస్ఎంఈలు, రవాణా సంస్థలు, హోటళ్లు, ఆహార ఉత్పత్తుల తయారీదారులు ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది. వ్యాపార సంస్థలు ఉత్పత్తి వ్యయాలను తగ్గించేందుకు ప్రయత్నించవచ్చు. కొన్ని సంస్థలు కొత్త పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలను వాయిదా వేసే అవకాశమూ ఉంటుంది.

ఆహార ధరలపై అప్రమత్తత అవసరం : దేశంలో ఆహార ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అక్టోబర్‌లో ఆహార సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 8.58 శాతంగా నమోదైంది. సెప్టెంబర్‌లో ఇది 8.66 శాతంగా ఉండటంతో స్వల్పంగా తగ్గినప్పటికీ, ఆహార ధరల ఒత్తిడి ఇంకా కొనసాగుతున్నట్లే.


కూరగాయలు, పప్పుధాన్యాలు, ధాన్యాలు, వంటనూనెలు, పాలు వంటి వస్తువుల సరఫరా వ్యవస్థలో సమస్యలు తలెత్తితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వ్యవస్థలను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వినియోగదారులకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం సమతుల్య విధానాన్ని అనుసరించాలి.

ద్రవ్యోల్బణం నిరంతరం పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక పరిణామాలు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్ల నుంచి చమురు, సహజ వాయువు, ఇతర ముడిసరుకులను దిగుమతి చేసుకునే వ్యయం పెరుగుతుంది. దీనివల్ల దేశ దిగుమతుల బిల్లు, విదేశీ మారకద్రవ్యంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది. రూపాయి మారకపు విలువపై కూడా పరోక్ష ప్రభావం పడవచ్చు. ఇంధన ధరల పెరుగుదల ప్రభుత్వ వ్యయాలపైనా ప్రభావం చూపుతుంది. రవాణా, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ఉత్పత్తి వంటి రంగాల్లో వ్యయాలు పెరిగితే ప్రభుత్వ ప్రాజెక్టుల అంచనాలు మారవచ్చు. మరోవైపు ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీ రేట్లు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడితే పరిశ్రమలు, గృహ రుణాలు, వ్యాపార రుణాలపై అదనపు భారం పడుతుంది. ద్రవ్యోల్బణం నియంత్రణ, ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యత పాటించడం రిజర్వ్ బ్యాంక్‌కు కీలక సవాలుగా మారుతుంది. వడ్డీ రేట్లను అధికంగా పెంచితే పెట్టుబడులు, వినియోగం మందగించే ప్రమాదం ఉంటుంది. అదే సమయంలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకపోతే ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి పెరుగుతుంది.

ధరల నియంత్రణే ఆర్థిక స్థిరత్వానికి పునాది : టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరడం దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరిక. అయితే ఈ గణాంకాన్ని చూసి దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడిపోయిందని నిర్ధారించడం కూడా సరికాదు. ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమైన అంశాలను విడివిడిగా విశ్లేషించి, వాటి ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టడం ముఖ్యం. ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. టోకు ధరల పెరుగుదల మొత్తం వినియోగదారులపై ఒకేసారి పడదు. ప్రభుత్వ విధానాలు, మార్కెట్ పోటీ, కంపెనీల లాభాల మార్జిన్లు, సరఫరా పరిస్థితులు, అంతర్జాతీయ ధరలు తదితర అంశాల ఆధారంగా దాని ప్రభావం క్రమంగా రిటైల్ మార్కెట్‌కు చేరుతుంది. అందువల్ల రాబోయే నెలల్లో ధరల ధోరణిని నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది. దేశ ఆర్థిక వృద్ధి అంటే కేవలం జీడీపీ పెరుగుదల మాత్రమే కాదు. సామాన్యుడి కొనుగోలు శక్తి పెరగాలి. పరిశ్రమలు లాభదాయకంగా నడవాలి. రైతులకు గిట్టుబాటు ధర లభించాలి. చిన్న వ్యాపారాలు నిలదొక్కుకోవాలి. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. ఈ లక్ష్యాలన్నీ నెరవేరాలంటే ధరల స్థిరత్వం అత్యంత అవసరం. అభివృద్ధి వేగం పెరగాలంటే ద్రవ్యోల్బణం అదుపులో ఉండాలి. ఉత్పత్తి వ్యయాలు తగ్గి, ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, పరిశ్రమలకు పెట్టుబడులపై నమ్మకం కలిగినప్పుడే ఆర్థిక ప్రగతికి నిజమైన అర్థం ఉంటుంది. 12.29 శాతం టోకు ద్రవ్యోల్బణం ప్రభుత్వానికి, ఆర్థిక విధాన నిర్ణేతలకు ఇచ్చిన ముఖ్యమైన సందేశం ఇదే. ధరల నియంత్రణను ప్రాధాన్యంగా తీసుకుని ప్రజల ప్రయోజనాలను, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రజలు కోరుకునేది భరోసా..

బెదిరింపులు కాదు !



- **కక్ష సాధింపు కాదు.. అభివృద్ధే రాజకీయ అజెండా కావాలి**
- **హెచ్చరికల రాజకీయాలతో పెరిగేది రాజకీయ వైషమ్యమే తప్ప ప్రజాభిమానం కాదు**
- **2029 అధికారమే లక్ష్యమైతే ప్రజల విశ్వాసమే వైసీపీకి అసలైన బలం**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 2029 ఎన్నికల దిశగా ఇప్పటి నుంచే వ్యూహ ప్రతివ్యూహాలు మొదలయ్యాయి. అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే. అయితే రాజకీయ పోరాటం ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పాలనా విధానాల చుట్టూ సాగాల్సిన సమయంలో వ్యక్తిగత కక్షలు, ప్రతీకార హెచ్చరికలు ప్రధాన చర్చాంశాలుగా మారడం ప్రజాస్వామ్య రాజకీయాలకు ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ముఖ్యంగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు 2029లో తిరిగి అధికారంలోకి వస్తే తమను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చేస్తున్న ప్రకటనలు రాజకీయంగా ఆలోచించాల్సిన అంశంగా మారాయి.

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులు, వేధింపులను సహించబోమని హెచ్చరిస్తున్నారు. తమను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తుల వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని, భవిష్యత్తులో అధికారంలోకి వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు, కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు ఇలాంటి ప్రకటనలు ఉపయోగపడవచ్చు. అయితే వాటి రాజకీయ ప్రభావం పార్టీ క్యాడర్‌కే పరిమితమవుతుందా? లేక సాధారణ ప్రజల్లోనూ సానుకూల స్పందన తెచ్చుకుంటుందా? అన్నది కీలకమైన ప్రశ్న.

అధికారం ప్రతీకారం తీర్చుకోవడానికి కాదు... : ప్రజాస్వామ్యంలో అధికారం అనేది ప్రజలకు సేవ చేయడానికి లభించే బాధ్యత. ఎన్నికల్లో గెలిచిన పార్టీకి పాలన సాగించే అవకాశం వస్తుంది. ఓడిపోయిన పార్టీకి ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యత ఉంటుంది. ఈ రెండు పాత్రలూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సమానంగా కీలకమైనవే. అయితే అధికారంలోకి వస్తే ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటామనే సందేశం ప్రజల్లోకి వెళితే, రాజకీయాల పట్ల విశ్వాసం తగ్గే ప్రమాదం ఉంది.

గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏ పార్టీ అయినా రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందనే ఆరోపణలు ఎదుర్కొని ఉండవచ్చు. ఇప్పుడు అధికారంలో ఉన్నవారిపై ప్రతిపక్షం కూడా అదే తరహా ఆరోపణలు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో రాజకీయ పార్టీలన్నీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. తప్పు చేసినవారు ఎవరైనా చట్టం ముందు సమానమే. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. అయితే ఆ చర్యలు రాజకీయ ప్రతీకారంతో కాకుండా ఆధారాలు, చట్టబద్ధమైన విచారణ, న్యాయ ప్రక్రియ ఆధారంగా జరగాలి.

రెడ్ బుక్‌కు డిజిటల్ బుక్ సమాధానమా? : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం రెడ్ బుక్ అంశం కూడా తరచూ చర్చకు వస్తోంది. అధికార కూటమి నేతలు గతంలో తమకు జరిగిన అన్యాయాలకు బాధ్యులైన వారిని వదిలిపెట్టబోమనే సంకేతాలు ఇచ్చిన సందర్భాలున్నాయి. ఇప్పుడు వైసీపీ నేతలు కూడా డిజిటల్ బుక్ పేరుతో అలాంటి హెచ్చరికలు చేయడం రాజకీయంగా కొత్త చర్చకు తెరలేపుతోంది. ఒక పార్టీ రెడ్ బుక్ ప్రస్తావిస్తే మరో పార్టీ డిజిటల్ బుక్ ప్రస్తావించడం ద్వారా రాజకీయాల్లో కొత్త పోటీ మొదలవుతుందేమో కానీ ప్రజలకు ఒరిగేదేమిటి?

పాలకపక్షం తన అధికారాన్ని ప్రతీకారానికి ఉపయోగించకూడదు. ప్రతిపక్షం కూడా తిరిగి అధికారంలోకి వస్తే ప్రతీకారం తీర్చుకుంటామనే ధోరణికి దూరంగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కారు. వారు వేర్వేరు రాజకీయ సిద్ధాంతాలు, విధానాలతో ప్రజల ముందుకు వచ్చే ప్రత్యామ్నాయాలు మాత్రమే. ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరిస్తే రాజకీయ వాతావరణం మరింత విషపూరితంగా మారుతుంది.

ప్రజలు కోరుకునేది భరోసా.. బెదిరింపులు కాదు... : వైసీపీలోని కొందరు సీనియర్ నాయకుల వ్యాఖ్యలు కూడా ఈ నేపథ్యంలో చర్చకు వస్తున్నాయి. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయనగరం సమావేశంలో చేసిన ఘాటు వ్యాఖ్యలు, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి స్థానిక ఎన్నికల సందర్భంగా చేసిన హెచ్చరికలు రాజకీయ వర్గాల్లో ప్రస్తావనకు వస్తున్నాయి. పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచే క్రమంలో నాయకులు చేసే వ్యాఖ్యలు కొన్నిసార్లు పార్టీకి మేలు చేయకపోగా, ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించే అవకాశం ఉంది.

ప్రజలు రాజకీయ నాయకుల నుంచి కోరుకునేది తమ భవిష్యత్తుపై భరోసా. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, మహిళలకు భద్రత, పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయమైన ప్రయోజనాలు, పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం కావాలని ఆశిస్తున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలి, వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలి, రాజధాని సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలి, పోలవరం ప్రాజెక్టు పూర్తికావాలి. ఇవన్నీ ప్రజల ముందున్న అసలు సమస్యలు.

విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ఆర్థిక, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సవాళ్లు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. ఇలాంటి సమయంలో రాజకీయ పార్టీలు తమ భవిష్యత్ ప్రణాళికలను ప్రజల ముందు ఉంచాలి. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని ఏ దిశగా తీసుకెళ్తామో స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. గత పాలనలో చేసిన తప్పులను అంగీకరించాల్సి వస్తే అంగీకరించాలి. భవిష్యత్తులో అలాంటి తప్పులు పునరావృతం కాకుండా ఎలాంటి మార్పులు తీసుకొస్తారో వివరించాలి.

2029కు వైసీపీ ముందున్న అసలైన సవాలు... : 2029 ఎన్నికలు వైసీపీకి అత్యంత కీలకం. గత ఎన్నికల్లో ఎదురైన పరాజయం నుంచి పార్టీ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోవాల్సి ఉంది. పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేయడం, ప్రజల్లో తిరిగి విశ్వాసం సంపాదించడం, యువతను ఆకర్షించడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రభుత్వ వ్యతిరేకత తమకు అనుకూలంగా మారుతుందని భావించడం సరైన రాజకీయ వ్యూహం కాదు. అధికారంలో ఉన్న పార్టీపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడటం ఒక అంశమైతే, ప్రత్యామ్నాయంగా వైసీపీని ఎందుకు ఎన్నుకోవాలనే ప్రశ్నకు సమాధానం చెప్పడం మరో అంశం.

ప్రతిపక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం వైసీపీ బాధ్యత. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజలకు న్యాయం జరిగేలా ఉద్యమించడం ద్వారా రాజకీయంగా బలపడవచ్చు. అయితే ప్రతి అంశాన్నీ వ్యక్తిగత కక్షలు, భవిష్యత్తులో చర్యలు, ప్రతీకార హెచ్చరికల కోణంలో చూడటం పార్టీ విస్తరణకు అవరోధంగా మారే ప్రమాదం ఉంది.

ప్రజాస్వామ్యానికి కావాల్సింది రాజకీయ పరిణతి : రాజకీయాల్లో విమర్శలకు హద్దులు ఉండవచ్చు కానీ ప్రజా సమస్యలపై పోరాటానికి ఉండకూడదు. తప్పు చేసిన అధికారులైనా, రాజకీయ నాయకులైనా చట్టం ముందు నిలబడాల్సిందే. అయితే ఆ ప్రక్రియకు రాజకీయ రంగు పులమకూడదు. ప్రభుత్వం మారిన ప్రతిసారీ అధికారులపై చర్యల భయం ఉంటే పాలనా వ్యవస్థలో స్వతంత్రత, నిష్పాక్షికత దెబ్బతింటాయి. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనయ్యే ప్రమాదం ఉంది. అధికార కూటమి అయినా, ప్రతిపక్ష వైసీపీ అయినా ఈ విషయాన్ని గుర్తించాలి. రాజకీయ కక్షల చక్రం నిరంతరం తిరుగుతూ ఉంటే అభివృద్ధి వెన



ప్రత్యేక పూల అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు

జగ్గయ్యపేట, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :

కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా పెనుగంచిప్రోలులోని శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో ఈ మాసంలో లభించే వివిధ రకాల పూలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ ప్రత్యేక పూల అలంకరణకు పెనుగంచిప్రోలుకు చెందిన వైపీఆర్ గార్డెన్స్ నిర్వాహకులు రూ. 1.50 లక్షలు విరాళంగా అందించారు.

కృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఆవిష్కరించిన సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :

తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం దొండపాడు గ్రామంలో శ్రీ కృష్ణదేవరాయ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. శ్రీ కృష్ణదేవరాయలు తన పరిపాలనా దక్షత, ప్రజా సంక్షేమం, సాహిత్యాభిమానం ద్వారా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వంగవీటి మోహనరంగా ప్రజల కోసం నిరంతరం కృషి చేసి విశేష ప్రజాభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడని కొనియాడారు. మహనీయుల ఆశయాలు, సేవలను భావితరాలకు తెలియజేసేలా విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్తీక మాసంలో మున్నూరు కాపు--కాపు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించడం ద్వారా ఐక్యత, ఆత్మీయత, సోదరభావం మరింత బలపడతాయని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని సామాజిక వర్గాల ప్రతినిధులు, గ్రామస్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మున్నూరు కాపు నాయకులు, జగ్గయ్యపేట కృష్ణదేవరాయ సేవా సమితి కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర లేని లోటు తీర్చలేనిది

ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యుడు గొంది నరేంద్ర మృతి తనకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన గొంది నరేంద్ర సంస్మరణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన స్వగ్రామమైన దావాజీగూడెంలోని ఎస్ఎం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నరేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నరేంద్ర సేవలు మరువలేనివని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయానికి నరేంద్ర ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆకస్మికంగా అనారోగ్యానికి గురైన నరేంద్రను కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడం బాధాకరమన్నారు. స్థానికంగా అందరితో కలివిడిగా ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న నరేంద్ర గ్రామస్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. నరేంద్ర కుటుంబానికి పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటామని యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు.





ఆటపాటలతో కేరింతలు..

ఆరోగ్య పాఠాలతో మెలకువలు





- నలంద విద్యానికేతన్‌లో అట్టహాసంగా 'కిడ్స్ కార్నివాల్'
- సీపీఆర్, ప్రథమ చికిత్సపై చిన్నారులకు ప్రత్యక్ష అవగాహన
- ప్రత్యేక ఆకర్షణగా మణిపాల్ 'మామ్స్ స్టోరీ' కార్యక్రమం
- ఆర్జే బెజవాడ రామ్ సందడితో ఉర్రూతలూగిన చిన్నారులు

విజయవాడ, నవంబరు16 (జర్నలిస్ట్ ఫైల్) :

విద్యతో పాటు విజ్ఞానం.. వినోదంతో పాటు ఆరోగ్యంపై అవగాహన.. ఆటపాటలతో ఆనందం.. ఇలా నలంద విద్యానికేతన్‌లో నిర్వహించిన 'కిడ్స్ కార్నివాల్' చిన్నారుల కేరింతల మధ్య అట్టహాసంగా సాగింది. విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ వేడుకకు మణిపాల్ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ ఎ. శ్రీముఖి (కన్సల్టెంట్ పీడియాట్రిక్స్ అండ్ నియోనాటాలజీ), పీడియాట్రిషియన్లు డాక్టర్ అనురూప, డాక్టర్ అనుపమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మణిపాల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలోని 'మామ్స్ స్టోరీ' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆరోగ్యం, అత్యవసర వైద్య సహాయంపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో సీపీఆర్ ఎలా చేయాలి? ప్రథమ చికిత్స ఎలా అందించాలి? అనే అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న పోటీలు.. ఆర్జే సందడి

చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా నిర్వహించిన ఆటపాటలు, వినోద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరి చిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. రెడ్ ఎఫ్ఎం ఆర్జే బెజవాడ రామ్ తనదైన వ్యాఖ్యానంతో చిన్నారులు, తల్లిదండ్రులను ఉత్సాహపరిచారు.

జీవన నైపుణ్యాలు ఎంతో ముఖ్యం: ప్రిన్సిపల్ ఎం. పద్మజ

ఈ సందర్భంగా నలంద విద్యానికేతన్ ప్రిన్సిపల్ ఎం. పద్మజ మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ఆరోగ్య స్పృహ, సామాజిక బాధ్యత, సృజనా త్మకతను పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని, జీవన నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మొత్తంగా ఈ కార్నివాల్ చిన్నారులు, తల్లిదండ్రులకు ఆనందాన్ని పంచుతూ మధుర జ్ఞాపకంగా నిలిచింది.

దేవినేని అవినాష్‌కు ఎల్లవేళలా అండగా ఉంటాం

- మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు స్పష్టం
- 22వ డివిజన్‌లో వైసీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం
- పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు

విజయవాడ, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :

విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని రామలింగేశ్వర నగర్ 22వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలపై నాయకులు సమావేశంలో విశ్లేషించారు.ఈ సందర్భంగా ఆళ్ల చెల్లారావు మాట్లాడుతూ దివంగత మాజీ మంత్రి దేవినేని





రాజశేఖర్ (నెహ్రూ) సహకారంతో తాను విజయవాడ డిప్యూటీ మేయర్‌గా అవకాశం పొందానని, దేవినేని అవినాష్ సహకారంతో తన కుమార్తె బెల్లం దుర్గకు కార్పొరేటర్‌గా, డిప్యూటీ మేయర్‌గా అవకాశం లభించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో తాము, తమ కుటుంబం ఎల్లప్పుడూ దేవినేని అవినాష్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అవినాష్ సహకారంతో పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు బలరాం రెడ్డి, సమీ, రాజు, బాలాజీ, గుప్తా, కొండ, సాయి రెడ్డి, తిరుమలగిరి వెంకయ్య నాయుడు, కలాం, సత్యనారాయణ, శివ, సీతారామయ్య, శ్రీను, రవి, బాబి, రమేష్, సుధాకర్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి





- కార్తీక మాస ఉత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ అధికారుల సమీక్ష
- అన్నవరం దేవస్థానంలో క్షేత్రస్థాయి పరిశీలన

అన్నవరం, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :

కార్తీక మాస ఉత్సవాల సందర్భంగా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం పరిశీలించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ప్రాంతీయ సంయుక్త కమిషనర్, కాకినాడ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్, శ్రీ తలుపులమ్మ అమ్మవారి ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వ హణాధికారి విశ్వనాథరాజు అన్నవరం దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్తీక మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానంలో చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థా యిలో పరిశీలించారు. భక్తులకు సజావుగా, సు రక్షితం గా స్వామివారి దర్శనం కల్పించేందుకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, భద్రతా చర్యలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు మెరుగైన సౌ కర్యాలు కల్పించాలని సూచిం చారు. రద్దీ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. కార్తీక మాసం సంద ర్భంగా భక్తులకు ప్రశాంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 900 మందికి అన్నదానం

విశాఖ, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) :

సమాజసేవా కార్యక్రమాల్లో భాగంగా విశాఖ లయన్స్ క్లబ్ మరోసారి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పేదల ఆకలి తీర్చేందుకు ముందుకొచ్చింది. ప్రతినెలా క్లబ్ సభ్యుల పుట్టినరోజులను పురస్కరించుకుని వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ఈసారి 900 మందికి అన్నదానం చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు తుకారామ్ తెలిపారు. ఈ సందర్భంగా జన్మదినోత్సవాలు జరుపుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యావేత్త డాక్టర్ పి. నాగభూషణం, మోహన్ రెడ్డి, లాబూరాం, గోపికృష్ణ, అంబాలాల్ రాంస్వరూప్ తదితరులు మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మెంబర్ డాక్టర్ సురేంద్రగౌడ్, కార్యదర్శి రమేష్, కోశాధికారి హర్ష, బాలకృష్ణ, పవన్, గిరిబాబు, సుబ్బారెడ్డి, వినోద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి,మరికొందరికి ఉపాధి కల్పించాలి :ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.







రంగారెడ్డి,నవంబరు16 (జర్నలిస్ట్ ఫైల్): ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడ కుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగ డంతో పాటు,మరికొందరికి ఉపాధి అవ కాశాలు కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలు పునిచ్చారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్ లో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ పరిశ్ర మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎన్ఎస్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి పారిశ్రామికవే త్తలుగా నూతన ప్రయాణాన్ని ప్రారంభి స్తున్న యువకులు విశాల్, సాగర్‌లను అభి నందించారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువత ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధా రపడకుండా తమ కాళ్లపై తాము నిలబడా లనే సంకల్పంతో పరిశ్రమను స్థాపించడం అభినందనీయమన్నారు.తాము స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదగడంతో పాటు,ఇతరులకు కూడా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు రావడం ఎంతో స్ఫూర్తిదాయక మని పేర్కొన్నారు.యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. విశాల్, సాగర్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాలనుకునే యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.వీరి విజయ ప్రయాణం మరెందరో యువతకు స్ఫూర్తినిస్తూ, స్వయం ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధి దిశగా ప్రోత్సహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.యువతలో ఉన్న నైపుణ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మ కత సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజానికి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాల్లో యువ పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్ర రావు, సీపీఓ సౌమ్య,జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, పలు పారిశ్రామిక వేత్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు

- పలు ప్రాంతాల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధులు.



భద్రాద్రి కొత్తగూడెం, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాచలంలో భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయం, పాత మార్కెట్, ఐటీడీఏ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన కార్యక్రమాల్లో ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు పాల్గొని బిర్సా ముండా చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణదొర బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సమాజ హక్కులు, ఆత్మగౌరవం, ఐక్యత, అభివృద్ధి ఆవ శ్యకతను నాయకులు వివరించారు.భద్రాచలం ఆదివాసీ సమితి ప్రధాన కార్యదర్శి పాయం రవి వర్మ,సీనియర్ నాయకుడు కుంజా ధర్మ, యువ నాయకులు కుంజా సంతోష్, ఆదివాసీ నాయకులు పటేల్ బెల్లం రమణయ్య, గుండు శరత్, ఈసాల రమణయ్య, ఆదివాసీ పెద్దలు జగ్గా పుల్లయ్య, కోర్స రవి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి ఆదివాసీల హక్కుల పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన భగవాన్ బిర్సా ముండా పోరాటం, త్యాగం చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణ కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఆదివాసీ సమాజ ఐక్యతను కాపాడుకుంటూ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బిర్సా ముండా ఆశయాలను భావితరా లకు అందించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు.

కేబీఆర్ ఫౌండేషన్ వారి సేవా రత్న అవార్డును అందుకున్న కంబాల శివలీల.



గుర్రంపోడు, నవంబరు 16 (జర్నలిస్ట్ ఫైల్) : నల్లగొండ జిల్లా కనగల్లు మండల కేంద్రానికి చెందిన న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు విశ్వమాత మదర్ తెరిసా అవార్డు గ్రహీత కంబాల శివ లీల కేబీఆర్ ఫౌండేషన్ వారి సేవా రత్న అవార్డును అందుకున్నారు.ఆదివారం గుంటూరు లోని రెవెన్యూ కల్యాణ మండపం హాల్ నందు కేబీఆర్ ఫౌండేషన్ వారు నిర్వహించిన 8వ సమాజ సేవకుల సేవకుల ఆత్మీయ సమ్మేళ నంలో కే బి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలరాజు గౌతమ్, డాక్టర్ మునీర్ షరీఫ్ చేతుల మీదుగా కంబాల శివ లీల సేవా రత్న అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ.. న్యూ కంబాల శివ లీల ఫౌండేషన్ తరపున తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి తనకు ఈ అవార్డును అందజే సిన కేబి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలరాజు గౌతమ్ మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో సమాజ సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.

ప్రకృతి ఆరాధనకు, త్యాగానికి ప్రతీక ఛఠ్ పూజ: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్



శేరిలింగంపల్లి,నవంబరు16 (జర్నలిస్ట్ ఫైల్): ఎంతో భక్తిశ్ర ద్ధలతో, పవిత్రంగా జరుపుకుం టున్న మహా పర్వదినం ఛఠ్ పూజా వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. రాయదుర్గంలోని మల్కం చెరువు వద్ద నిర్వహిం చిన ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య భగవానుడిని, షష్ఠి దేవిని (ఛఠీ మాతను) ఆరాధించే ఈ మహోత్సవం మన సంస్కృతికి, ప్రకృతి ఆరాధనకు ఒక గొప్ప ప్రతీక అని కొనియాడారు.మన జీవితానికి ఆధారమైన సూర్యదేవునికి కేవలం వెలుగునిచ్చినందుకు మాత్రమే కాకుండా, సమస్త జీవకోటికి ప్రాణాధారంగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపే ఏకైక పండుగ ఛఠ్ పూజ అని ఆయన పేర్కొన్నారు. ఈ కఠినమైన ఉపవాస దీక్షలను ఆచరిస్తూ, ప్రకృతిని, నదులను, సూర్య భగవానుడిని భక్తితో కొలిచే తల్లుల మరియు సోదరీమణుల త్యాగానికి, నిబద్ధతకు ప్రతి ఒక్కరం తలవంచాల్సిందేనని అన్నారు.ఈ పవిత్రమైన పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాన్ని, సుఖశాంతులను నింపాలని, సమాజంలో భాతృభావం మరింత వర్ధిల్లాలని ఆయన మనసారా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్,శివ సింగ్ అమరయాదవ్ , అశోక్ ,రాజేశ్వర్, శ్యామ్ యాదవ్ , రవి ముదిరాజ్, రాజు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చింతనెక్కొండకు అభివృద్ధి బాట!

- రోడ్డు పనులకు శంకుస్థాపన.. కొత్త పింఛన్ల పంపిణీ



వరంగల్, నవంబరు16 (జర్నలిస్ట్ ఫైల్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు.ఆదివారం వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలం చింతనె క్కొండ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క,వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతని స్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు.ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చింతనెక్కొండలో రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ ఎర్ర ప్రియాంక అనిల్ కుమార్, కల్లెడ పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, మండల అధ్యక్షురాలు సావిత్రి, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, వివిధ చైర్మన్లు, మండల అధ్యక్షులు, సర్పంచులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు

మానవత్వంతో బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన కోరం.ఉమా – సురేందర్



ఇల్లందు, నవంబరు16 (జర్నలిస్ట్ ఫైల్): భద్రాద్రి కొత్తగూడెం /జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి స్టేజి వద్ద ఇటీవల జరిగిన టపాసుల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, శరీరం కాలిన గాయాలతో హైదరా బాద్‌లోని గాంధీ ఆసుపత్రి, KBK ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం. ఉమా – సురేందర్ పరామర్శించారు.ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరి స్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా రమేష్ కుమారుడి వైద్య ఖర్చుల కోసం రూ.10,000 , నరేష్ కుమారుడి వైద్య ఖర్చుల కోసం రూ.20,000 చొప్పున మొత్తం రూ 30,000 ఆర్థిక సహాయం అందించారు.ప్రమాదంలో గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.ఆపదలో ఉన్న కుటుం బాలకు ధైర్యం చెప్పి, చేతనైన సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్న కోరం. ఉమా – సురేందర్,

మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలు నామినేషన్ దాఖలు



- కూటమి నాయకులు, కార్యకర్తలతో భారీ పాదయాత్రగా వెళ్లి నామినేషన్ సమర్పణ

మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ పదవికి కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పేరం ఏడుకొండలు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి నామినేషన్ పత్రాలను సమర్పించారు.

ఈ సందర్భంగా పేరం ఏడుకొండలు మాట్లాడుతూ తనకు మేయర్ అభ్యర్థిత్వాన్నికేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నగర అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ నామినేషన్ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు గొరిగపూడి ప్రసాద్ మృతి



- మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఘన నివాళి

కొల్లూరు (జర్నలిస్ట్ ఫైల్): బాపట్ల జిల్లా కొల్లూరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, మాజీ వైస్ ఎంపీపీ గొరిగపూడి ప్రసాద్ (ఏబేలు) (65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొల్లూరులోని ఆయన నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. పార్టీకి, స్థానిక ప్రజలకు ప్రసాద్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన నామినేషన్లు



- ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యం: ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో తాడేపల్లి–మంగళగిరి నగరపాలక సంస్థ, పొన్నూరు పురపాలక ఎన్నికలకు సంబంధించి గత మూడు రోజులుగా నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలైన తాడేపల్లి, మంగళగిరి, పొన్నూరు మున్సిపల్ కార్యాలయాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నామినేషన్ కేంద్రాల చుట్టూ 100, 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఆంక్షలు అమలు చేశామని తెలిపారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం ముందస్తు చర్యలు చేపట్టి, అభ్యర్థులు, అనుచరులు గుంపులుగా చేరకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. డ్రోన్ కెమెరాలతో పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించారు.

నామినేషన్ కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. అభ్యర్థులు, వారి ప్రతినిధులు నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు భద్రత కల్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఎస్పీ పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యమని వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలీసు ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

నేరస్తులకే వైసీపీ నేతల పరామర్శలు : ఎమ్మెల్యే నసీర్

- రాష్ట్రంలో ప్రజల గురించి వైసిపికి పట్టనే పట్టదు
- నామినేషన్లను అడ్డుకుంటే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయగలిగేవారా
- రామచంద్రారెడ్డికి సజ్జలకు చట్టం గురించి తెలియదా ?
- ఇంకెన్నాళ్లు వైసీపీ దౌర్జన్యాలను చూస్తూ ఉండాలి
- జైలు వద్ద పోలీస్ అధికారులపై దాడి అత్యంత హేయం



గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): ప్రజలు ఛీ కొట్టినా వైసీపీ నేతలు తమ పద్ధతి మార్చుకోవడం లేదని, మిర్చి దొంగ అప్పిరెడ్డిని పరామర్శించడానికి వచ్చి పోలీసులపై దాడి చేయడం హేయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ కమిటీ చైర్మన్ నసీర్ మండిపడ్డారు. సోమవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదాకు కూడా నోచుకోని వైసీపీ ఇంకా తన దౌర్జన్య వైఖరిని మార్చుకోలేదన్నారు. పోలీసులు పచ్చ చొక్కాలు తొడుక్కొని ఉంటే స్థానిక ఎన్నికల్లో వైసిపి కనీసం పోటీ చేయగలిగేదా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అంటూ ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. నిందితులను పరామర్శించే సంస్కృతి వైసీపీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. 19 కేసులు ఉన్న లేళ్ల అప్పిరెడ్డి నిర్దోషి అయితే కోర్టులో నిరూపించుకోవాలని హితవు పలికారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు జగన్మోహన్ రెడ్డి కనీస క్రమశిక్షణ నేర్పించాలన్నారు.

వైసీపీ అజెండా ఏంటో రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే స్పష్టంగా అర్థమైందని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బుద్ధి చెప్పారని అన్నారు. ఓట్లతో నిండి ఉన్న బ్యాలెట్ బాక్స్‌ను అప్పిరెడ్డి అక్రమంగా తన స్వాధీనంలో ఉంచుకున్నారని. బ్యాలెట్ బాక్స్ లపై ఎన్నికల అధికారులు సంతకాలు ఉంటాయనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. కేవలం అనుమతి ఉన్న ఒకరిద్దరిని మాత్రమే జైలులోకి అనుమతిస్తారని, సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన అనుయాయులు కాన్వాయ్ మొత్తాన్ని లోపలికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారని తెలిపారు. అడ్డుకోబోయిన పట్టాభిపురం ఎస్ఐ రామాంజనేయులుపై దాడికి పాల్పడటం దారుణం అన్నారు. సకల శాఖల మంత్రిగా పని చేసిన సజ్జలకు ఆ మాత్రం చట్టం గురించి తెలియదా అని నిలదీశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే వైసిపి అవాకులు చవాకులు పేలుతుందని మండిపడ్డారు. తుఫానులు, ఎల్ నిలో వంటి ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పరామర్శించకుండా జైలులో ఉన్న నిందితుల దగ్గరకు మాత్రమే వైసీపీ నాయకులు వెళ్తారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో ప్రజలు 95 కూటమికి మద్దతుగా నిలిచారన్నారు. చట్టాలను గౌరవించకపోతే వైసీపీకి తగిన శాస్తి జరుగుతుందని ఎమ్మెల్యే నసీర్ హెచ్చరించారు.

ప్రజా ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి

- జీఎంసీ అధికారులకు కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌లో 26 అర్జీలు స్వీకరణ.. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు



గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే అర్జీలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు ఇతర మార్గాల్లో అందిన ఫిర్యాదుల పరిష్కార పురోగతిని విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కేవలం ఆన్‌లైన్ రికార్డుల్లో ఫిర్యాదులు పరిష్కరించినట్లు నమోదు చేస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో పనులు పూర్తిచేసి ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఏదైనా సమస్య పరిష్కారానికి సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురైతే, వాటిని అర్జీదారులకు వివరించి తగిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. నిర్ణీతగడువులోగా అర్జీలను పరిష్కరించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 26 అర్జీలు అందాయి. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 10, ఇంజినీరింగ్ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 5, రెవెన్యూ విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు అధికారులు వెల్లడించారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సాంబశివరావు, సి.హెచ్. శ్రీనివాస్, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి. వెంకటేశ్వరరావు, సీపీ రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలలో 21, 22న పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు



గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, పొన్నూరు పురపాలక సంఘం ఎన్నికలకు ఈ నెల 21, 22 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. పురపాలక ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికలపై జిల్లా కలెక్టర్ సోమవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను ఎంపిక చేసి, అచ్చట పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

19న జడ్పీ, ఎంపీపీ పరోక్ష ఎన్నికలు

జడ్పీ, ఎంపీపీ పరోక్ష ఎన్నికలు 19వ తేదీన నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చెప్పారు. వీడియోగ్రఫీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కో ఆప్షన్స్ సభ్యుల ఎన్నిక, ఉపాధ్యక్షులు, అధ్యక్షుల ఎన్నిక క్రమ పద్ధతిలో జరగాలని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నోటీసులు జారీ చేయడం జరిగిందని అన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ దశ నోటిఫికేషన్ విడుదల

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండవ దశ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండవ దశ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఈ నెల 25, 26 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయుటకు, మూడవ దశలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు 28, 29 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయుటకు ప్రస్తుతానికి నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించుటకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా మాట్లాడుతూ ఎం.టి.ఎం.సి ఎన్నికల సామగ్రి పంపిణీకి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రిసెప్షన్, స్ట్రాంగ్ రూములను కూడా విశ్వవిద్యాలయంలోనే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఇందులో 477 మంది పాల్గొన్నారని అన్నారు. 570 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరంలో సోమవారం 129 మంది హాజరయ్యారన్నారు. 170 బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు

- ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేని కూటమి: సజ్జల
- వైసీపీకి, పోలీసులకు మధ్యే స్థానిక ఎన్నికల పోరు: పెద్దిరెడ్డి



గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం లేక కూటమి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయలేక పోలీసులకు స్థానిక ఎన్నికల నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టు పద్ధతిలో అప్పగించారని ఆరోపించారు. గుంటూరు సబ్‌జైలులో ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

బ్యాలెట్ బాక్స్‌ను పక్కకు తరలిస్తున్నారని గుర్తించి అడ్డుకుని తిరిగి అధికారులకు అప్పగించే ప్రయత్నం చేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని సజ్జల అన్నారు. ఈ ఘటనకు సంబంధించి వీడియోల్లో వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లు నమోదు చేసి అప్పిరెడ్డిని పది రోజులుగా జైలులో నిర్బంధించడం అన్యాయమని పేర్కొన్నారు. ఎస్పీ, కలెక్టర్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పినప్పటికీ ఎఫ్ఐఆర్‌లో తీవ్రమైన అభియోగాలు నమోదు చేయడాన్ని ప్రశ్నించారు.

పోలీసులు తమ విధులను పక్కనపెట్టి అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని సజ్జల ఆరోపించారు. డీజీపీ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి, పోలీసులకు మధ్య జరుగుతున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. తమ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, అరెస్టులతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల ద్వారా ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, ఈ పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, ఏసురత్నం, తాడికొండ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి డైమండ్ బాబు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూరి ఫాతిమా, విజయవాడ మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తాడికొండ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గృహ స్థలాల రెగ్యులరైజేషన్ విచారణ పక్కాగా ఉండాలి



గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): గృహ స్థలాల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు విచారణ పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. వివిధ విభాగాల క్రింద నిర్దేశిత ప్రదేశంలో నివాస భవనాలు, తదితర అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డికెటి, జి.ఓ 30, 306, దేవదాయ భూములు, వక్ఫ్, అభ్యంతరకర భూములు, ఇతర విభాగాల క్రింద ఉన్న భూములను విచారణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో సూచించిన విధంగా వివిధ విభాగాల వారీగా ఉన్న స్థలాల్లో ఉన్న వారి అర్హతను గుర్తించాలని చెప్పారు. ఇందుకు గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు పొందాలని స్పష్టం చేశారు. చెరువులు, కాలువలు, దారులు తదితర అభ్యంతర విభాగాల క్రింద ఉన్న స్థలాలను పక్కాగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. జలవనరుల శాఖ, భూగర్భ జలాల శాఖ తదితర సంబంధిత శాఖల నుండి నివేదికలు పొందాలని సూచించారు. వీటిని అమలు చేయటకు స్పష్టమైన విధి విధానాలు (ఎస్.ఓ.పి) తయారు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, తదితరులు పాల్గొన్నారు.

సెన్సస్-2027 నిర్వహణకు పకడ్బందీగా శిక్షణ పొందాలి



- ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ

గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): సెన్సస్–2027 నిర్వహణలో భాగంగా క్షేత్రస్థాయిలో జనాభా గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఫీల్డ్ ట్రైనర్లు పూర్తి అవగాహనతో శిక్షణ పొందాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ సూచించారు.

సెన్సస్–2027లో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సెన్సస్ నిర్వహణలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర కీలకమని, వారికి అందించే శిక్షణ ద్వారా క్షేత్రస్థాయిలో గణన ప్రక్రియ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. శిక్షణలో వివరించే అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ శిక్షణ అధికారి ప్రసన్నకుమార్, జిల్లా సెన్సస్ కోఆర్డినేటర్లు ఆదిలక్ష్మి, రమణులు ఫీల్డ్ ట్రైనర్లకు సెన్సస్ నిర్వహణ విధానాలు, గణన ప్రక్రియలో పాటించాల్సిన మార్గదర్శకాలు, సంబంధిత అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు.

మహిళా హోంగార్డు కుటుంబానికి రూ.2.11 లక్షల ఆర్థిక సాయం



- ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించిన తోటి హోంగార్డులు

గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): పోలీసు శాఖలో సహోద్యోగుల మధ్య ఐక్యత, పరస్పర సహకారానికి నిదర్శనంగా మహిళా హోంగార్డు నాగాటి కరుణకుమారి కుటుంబానికి తోటి హోంగార్డులు రూ.2,11,680 ఆర్థిక సాయం అందించారు. గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కరుణకుమారికి అందజేశారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులందరూ స్వచ్ఛందంగా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించి ఈ మొత్తాన్ని సమకూర్చారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 31 ఏళ్లపాటు పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో సేవలందించిన కరుణకుమారి తన కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఒక కుటుంబ సభ్యులేనని, కష్టసమయంలో ఒకరికొకరు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ సురేష్ బాబు, పోలీసు అధికారులు, హోంగార్డ్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

రాజమహేంద్రవరం అభివృద్ధికి కూటమిని గెలిపించాలి



- మేయర్ అభ్యర్థి రేలంగి రాణి శ్రీదేవి నామినేషన్ ర్యాలీలో మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): నగర సమగ్ర అభివృద్ధి కూటమి గెలుపుతోనే సాధ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి మేయర్ అభ్యర్థి రేలంగి రాణి శ్రీదేవి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కంబాల చెరువు నుంచి ఛత్రపతి శివాజీ మార్గం మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది.

ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, భాజపా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలోనూ కొనసాగాలంటే నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్లను భారీ మెజారిటీతో గెలిపిస్తే నగర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో పట్టణాలకు నూతనోత్తేజం లభించిందని తెలిపారు.

కాంగ్రెస్‌కు దేశం కంటే అధికారమే ముఖ్యం



- రాహుల్, రేవంత్ వైఖరిని తప్పబట్టిన బీజేపీ నేత తాడువాయి రామకృష్ణ

గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): కాంగ్రెస్ పార్టీ అధికార దాహం, దేశ ప్రయోజనాల పట్ల ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న వైఖరి సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ తాడువాయి రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సదస్సులో విదేశీ నాయకురాలు భారతదేశం, ఎన్నికల వ్యవస్థపై అవమానకర వ్యాఖ్యలు చేసిన సమయంలో రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవ్వుతూ చప్పట్లు కొట్టడం కాంగ్రెస్ పార్టీ విష సంస్కృతికి నిదర్శనమని ఆరోపించారు. ఒక విదేశీ నాయకురాలు భారతదేశానికి వచ్చి దేశ ప్రజలను, రాజ్యాంగ వ్యవస్థలను, ఎన్నికల సంఘాన్ని అవమానించేలా మాట్లాడుతుంటే కాంగ్రెస్ అగ్రనేతలు నవ్వుతూ స్పందించడం ఏమిటని ప్రశ్నించారు. భారతదేశ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఖండించాల్సింది పోయి, వాటిని ప్రోత్సహించేలా వ్యవహరించడం దేశ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు.

భారతదేశాన్ని అవమానిస్తుంటే ఎవరైనా ఎలా నవ్వగలరని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రశ్నించడం సముచితమన్నారు. కాంగ్రెస్ నాయకులకు దేశ ప్రయోజనాల కంటే రాజకీయ అధికారం, స్వార్థ ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. విదేశీ శక్తుల ముందు దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ధోరణిని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని, కాంగ్రెస్ అనుసరిస్తున్న దేశ వ్యతిరేక వైఖరిని ప్రజలు క్షమించరని తాడువాయి రామకృష్ణ పేర్కొన్నారు.

సేంద్రీయ వ్యవసాయ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



- సేంద్రీయ సాగులో కౌలురైతు నాగరాజు కృషి, ప్రయత్నం ప్రశంసనీయం

ఉయ్యూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): వ్యవసాయంలో రసాయన సాగు నుండి కేంద్రీయ సాగుకు మారిన రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక భరోసా కల్పించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు.

ఉయ్యూరు మండలం కాటూరు కు చెందిన దళిత కౌలు రైతు గుజ్జు నాగరాజు సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్న పది ఎకరాల వరి పొలాన్ని సురేష్ బాబు పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయం గురించి రైతును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు,పురుగు మందులు లేకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేలా సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న నాగరాజు ప్రశంసనీయులని తెలిపారు. వ్యవసాయంలో రసాయనాలు వాడటం వల్ల నేలసారం దెబ్బతినడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసే రైతులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, పంటల భీమా సౌకర్యం, దేశీయ జీవామృతం లాంటి ఎరువులు అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

సేంద్రీయ సాగు ద్వారా నాణ్యమైన ఆహార ధాన్యాలు ఉత్పత్తితో పాటు ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకునేలా వరిని పండిస్తున్న నాగరాజు ఇతర రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయంగా పంట పొలాలు పరిశీలించి నాగరాజును ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ద్వారా సేంద్రియ రైతులను ప్రోత్సహించి,మద్దతు లభించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా రైతు నాగరాజును సురేష్ బాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో 2.65 లక్షల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

- జ్వరాలు, రక్తహీనత, చర్మ, శ్వాసకోశ సమస్యల గుర్తింపు.. 3,218 మందికి రక్తహీనత
- తుపానుల అనంతరం రెండు వారాల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో 2.65 లక్షల మందికిపైగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వరుస తుపానుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నవంబరు 1 నుంచి 13వ తేదీ వరకు 2,148 వసతి గృహాల్లో ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. మొత్తం 2,65,556 మంది విద్యార్థులను పరీక్షించిన వైద్య బృందాలు అవసరమైన వారికి అక్కడికక్కడే చికిత్స అందించాయి. మరికొందరికి వైద్య సేవలు కొనసాగిస్తున్నాయి. ఈ వివరాలతో కూడిన నివేదికను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అధికారులు అందజేశారు.

వైద్య పరీక్షల్లో 4,436 మందికి చర్మవ్యాధులు, 961 మందికి శ్వాసకోశ సమస్యలు, 2,750 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. 3,218 మంది విద్యార్థుల్లో రక్తహీనత, 85 మందిలో అతిసార వ్యాధులు బయటపడ్డాయి. 14 మలేరియా, 8 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. డెంగీ కేసు ఒక్కటీ గుర్తించలేదు. మరో 1,842 మందికి ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

జిల్లాలవారీగా కాకినాడలో 15,165 మంది, ఏలూరులో 14,918 మంది, అనకాపల్లిలో 11,030 మంది, పోలవరంలో 27,281 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10,691 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో చర్మ, దంత, శ్వాసకోశ సమస్యలతోపాటు రక్తహీనత, మలేరియా, అతిసార వంటి కేసులు గుర్తించారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు అవసరమైన విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు.

వైద్య పరీక్షలతోపాటు వసతి గృహాల్లో తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రత, పరిసరాల పరిస్థితులను కూడా పరిశీలించారు. 1,706 వసతి గృహాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు బాగుండగా, 442 చోట్ల మెరుగుపరచాల్సిన అవసరముందని గుర్తించారు. మరుగుదొడ్ల నిర్వహణ 1,238 వసతి గృహాల్లో సంతృప్తికరంగా ఉండగా, 896 చోట్ల మెరుగుదల అవసరమని, మరో 14 చోట్ల మరుగుదొడ్లు అందుబాటులో లేవని లేదా మరమ్మతులు చేయాలని నివేదికలో పేర్కొన్నారు.

వసతి గృహాల్లో సురక్షిత తాగునీటి సరఫరా, క్రమం తప్పకుండా నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునే సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులు సూచించారు. వంటశాలల పరిశుభ్రత, ఆహార భద్రత, దోమల నియంత్రణ చర్యలు పటిష్ఠం చేయాలని, వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. అనుమానిత కేసులు పెరిగితే వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ ఆర్.వెంకటరమణ నివేదికలో వివరించారు.

12వ పీఆర్సీలో ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం జరగాలి

- పీఆర్సీ కమిషన్‌కు ఏపీ జేఏసీ అమరావతి వినతి
- ఆరు నెలల్లో నివేదిక సమర్పించాలని విజ్ఞప్తి



అమరావతి, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): గత 11వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) అమలులో తీవ్రంగా నష్టపోయిన ఉద్యోగులు, పెన్షనర్లకు 12వ పీఆర్సీలో న్యాయం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కోరారు. ఈ మేరకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో వివిధ అనుబంధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సోమవారం ఏపీ సచివాలయంలో 12వ పీఆర్సీ కమిషనర్ దినేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. గత పీఆర్సీలో ఉద్యోగులు, పెన్షనర్లు ఆశించిన ప్రయోజనాలు పొందలేక తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ఇప్పటికే ఆలస్యంగా నియమితులైన 12వ పీఆర్సీ కమిషన్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు, వారి అభిప్రాయాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పీఆర్సీకి సంబంధించిన అధ్యయనం, నివేదిక తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. వీలైనంత త్వరగా, గరిష్ఠంగా ఆరు నెలల వ్యవధిలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను అభ్యర్థించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏపీ సివిల్ సప్లైస్ సర్వీసెస్ అసోసియేషన్, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల సంఘం, ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ, ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం, స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

వివిధ సంఘాల తరఫున పి.ఎస్.ఎస్.ఎన్.పి. శాస్త్రి, డాక్టర్ ఎస్.ఎస్.ఎన్. రాజు, జి. మోహన్ బాబు, ఆర్.ఎస్.ఎస్.ఎస్. రాజు, కె. చంద్రశేఖర్, ఇర్ఫాన్, ఎ. కుమార్ రెడ్డి, బి.ఎస్.ఆర్. ప్రసాద్, వి. అర్లయ్య, షేక్ బాజీ, జనకుల శ్రీనివాసరావు, వై.వి. బ్రహ్మం, అంకాల కొండయ్య, జి. శివానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పి. రజని, అసోసియేట్ చైర్‌పర్సన్ ఎస్. శివకుమారి రెడ్డి, ట్రెజరర్ వి.ఎస్. సాయిలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. అనూషలత, ఏపీఆర్ఎస్ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



- బెసెంట్ టెక్నాలజీస్‌లో 28 మందికి ఉద్యోగాలు

గుంటూరు, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): మెడికొండూరు మండలం విశదాల గ్రామంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బెసెంట్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సంస్థ హెచ్ఆర్ రాజేష్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, సంస్థలో పని విధానాలు, భవిష్యత్తులో కెరీర్ అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరించారు. నైపుణ్యాలను పెంపొందించుకుంటూ వృత్తిపరంగా ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఉద్యోగాల్లో చేరిన తర్వాత కూడా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 28 మంది విద్యార్థులు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేసి అభినందించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీతారామయ్య, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రాజేష్ చంద్ర, డీఎస్ విభాగాధిపతి సాంబశివరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీవన, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన సంస్థ హెచ్ఆర్, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ విభాగాన్ని కళాశాల యాజమాన్యం అభినందించింది.

తుపాను హెచ్చరికల నేపథ్యంలో 377 మంది గర్భిణులు ఆసుపత్రులకు తరలింపు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వం మరోసారి తుపాను హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు ప్రసవ గడువు ఉన్న 3,478 మంది గర్భిణులను గుర్తించగా.. వారిలో 377 మందిని సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఇప్పటి వరకు ఆసుపత్రులకు తరలించిన గర్భిణుల్లో 171 మంది ప్రసవించారు. తుపాను సమయంలో తల్లీబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. తుపాను ప్రభావిత 15 జిల్లాల్లో వైద్యారోగ్య శాఖ సమస్తం సిద్ధం చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా 994 ప్రభుత్వ వైద్య సదుపాయాలు ఉండగా.. వాటిలో 282 వైద్య కేంద్రాలు తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని గుర్తించారు. 699 వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్సులు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు (102), సంచార వైద్య వాహనాలు (104) అందుబాటులో ఉంచారు. 88 తీర ప్రాంత ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు ఏర్పాట్లు చేశారు. 955 వైద్య కేంద్రాల్లో విద్యుత్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందుబాటులో ఉన్నాయి.

వైద్యారోగ్య శాఖ చేపట్టిన తుపాను సన్నద్ధత, గర్భిణుల తరలింపు, అత్యవసర వైద్య ఏర్పాట్ల వివరాలను కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు వెల్లడించారు.

ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఎస్ఆర్ఎం విద్యార్థుల క్షేత్రస్థాయి అధ్యయనం

- మార్కాపురం జిల్లాలో రెండు రోజుల పర్యటనలు
- గిరిజనులు, వలస కూలీల జీవన పరిస్థితులపై సమగ్ర సర్వే



అమరావతి, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): సమాజంలోని వివిధ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సమస్యల పట్ల అవగాహన, పరిష్కారాలను అన్వేషించే నైపుణ్యాలు పెంపొందుతాయని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ భావిస్తోంది. ఈ లక్ష్యంతో విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఇందులో భాగంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని పారిస్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన 35 మంది ఎంబీఏ విద్యార్థులు ఇటీవల మార్కాపురం జిల్లాలోని పలు గ్రామాల్లో రెండు రోజుల పాటు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ సార్ట్స్ సహకారంతో చేపట్టిన ఈ పర్యటనల్లో విద్యార్థులు గ్రామీణ ప్రజలు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజలతో మమేకమై వారి జీవన పరిస్థితులు, సామాజిక, ఆర్థిక అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం చేశారు.

ఈ నెల 12న వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన సుంకేసుల పునరావాస కాలనీ, తోకపల్లి గ్రామాలను విద్యార్థుల బృందం సందర్శించింది. ప్రాజెక్టు కారణంగా పునరావాసం పొందిన కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, పరిహారం, పునరావాసం అనంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యలు, జీవనోపాధి పరిస్థితులపై వివరాలు సేకరించింది. అనంతరం పెద్దారవీడు మండలంలోని గురిజేపల్లి, వీరభద్రాపురం, వెంకటాద్రిపాలెం గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో సమావేశమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులు, పంటల ద్వారా లభిస్తున్న వార్షిక ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, స్వయం ఉపాధి అవకాశాలు, కుటుంబ అవసరాలు వంటి అంశాలపై విద్యార్థులు సమాచారాన్ని సేకరించారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, వైద్య సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులు, గ్రామీణ మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేశారు. అలాగే నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గూడేలను సందర్శించి గిరిజన కుటుంబాల జీవన విధానాలను పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, ఆర్థిక ఇబ్బందులు, బాల్యవివాహాల వంటి సామాజిక సమస్యలపై ఆరా తీశారు. గిరిజన కుటుంబాలపై ఆర్థిక, సామాజిక పరిస్థితులు చూపుతున్న ప్రభావాన్ని తెలుసుకునేందుకు స్థానికులతో నేరుగా మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనల్లో పారిస్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ పువియరసు విద్యార్థుల బృందానికి నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారం వారి అకడమిక్ ప్రాజెక్టులు, పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పుస్తకాల్లో చదివిన అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం వల్ల సమాజంలోని వాస్తవ పరిస్థితులపై లోతైన అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో సేవా ఆధారిత అభ్యాసం, క్షేత్రస్థాయి అనుభవం, సమాజ భాగస్వామ్యం వంటి కార్యక్రమాలను యూనివర్సిటీ ప్రోత్సహిస్తోందని వివరించారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సార్ట్స్ సంస్థ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏపీ సచివాలయ సంఘం క్రీడోత్సవాలు ప్రారంభం





- 13 క్రీడా విభాగాల్లో 1,400 మంది ఉద్యోగుల పోటీలు..
- ఐదు రోజుల పాటు క్రీడా సంబరాలు
- క్రీడలతో ఉద్యోగుల్లో ఉత్సాహం!

అమరావతి, నవంబర్ 16(జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగుల్లో ఆరోగ్య స్పృహ, మానసిక ఉల్లాసం, ఐక్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీలు–2026 ఘనంగా ప్రారంభమయ్యాయి. సచివాలయంలోని సెంట్రల్ పార్కులో ఆదివారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ముఖ్య అతిథిగా హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు.

ఈ ఏడాది క్రీడా పోటీల్లో సుమారు 1,400 మంది సచివాలయ ఉద్యోగులు పాల్గొననున్నారు. మొత్తం 13 క్రీడా విభాగాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. ఉద్యోగులను నాలుగు గ్రూపులుగా విభజించి టీమ్ ఈవెంట్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సచివాలయ ప్రాంగణంతో పాటు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఎం.ఎస్.కె. ప్రసాద్ క్రికెట్ స్టేడియంలో పోటీలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా ఆర్.పి. సిసోడియా మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొనే పని ఒత్తిడిని తగ్గించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఐదు రోజుల పాటు జరిగే క్రీడోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలకు దూరంగా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ప్రాణాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, కార్యాలయం, ప్రభుత్వ యంత్రాంగం మరింత ఉత్సాహంగా పనిచేస్తాయని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కొత్త కార్యవర్గం ఏర్పాటైన తర్వాత సంక్రాంతి సంబరాలు, వివిధ పోటీలు నిర్వహించడంతో పాటు మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత క్రీడోత్సవాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడంతో పాటు ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, నిధుల విడుదలకు సంబంధించిన అంశాల పరిష్కారానికి సంఘానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తూనే ఉద్యోగుల పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించుకునేందుకు కృషి చేద్దామని అన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్య స్పృహతో పాటు పరస్పర స్నేహభావం, ఐక్యత, టీమ్ స్పిరిట్ పెంపొందించడమే ఈ క్రీడోత్సవాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్, సంఘం కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com